


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1


## క్లీన్ స్వీప్ దిశగా....

-నేడు న్యూజిలాండ్‌తో నాల్గో టి20రాత్రి 7.00గం॥లకు






## డిప్యూటీ సిఎం హామీ నెరవేరేనా?

పల్లె వెలుగు

# సమ్మక్క- సారక్క జాతర పోయొద్దామా!

●నేటి నుంచే మహాజాతర.. 4రోజుల పాటు ఉత్సవాలు ●నేడు కన్నెపల్లి నుంచి గద్దెలపైకి సారలమ్మ



**వరంగల్, జనవరి 27 పల్లె వెలుగు**

దారులన్నీ మేడారం వైపే! పోదామిక మహాజాతరకు అంటూ భక్తజనం కదులుతోంది. వందుకునేందుకు సరుకులు.. కోళ్లు, గొర్రెలు, వనదేవతలకు మొక్కులు తీర్చుకునేందుకు బెల్లం ముద్దలు, పసుపు, కుంకుమ, ఒడిబియ్యాన్ని ఎడ్ల బండ్లు, ఆటోల్లో వేసుకొని 'జై సమ్మక్క-జై జై సారలమ్మ' అంటూ పిల్లాజెల్లాను వెంట బెట్టుకొని బయలుదేరింది. రాష్ట్రం నలువైపుల నుంచే కాదు.. పొరుగున ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీసగఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలుతున్నారు. మేడారం మహాజాతర మొదలయ్యేది బుధవారమే. ఈ రోజు నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు రోజుకో ప్రధాన ఘట్టంతో మహాజాతర భక్తులను ఆనందపారవశ్యంలో ముంచెత్తనుంది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి అభివృద్ధి, ఆధునికీకరణ పనులను ప్రభుత్వం చేపట్టి పూర్తిచేయడంతో మహాజాతర ఈసారి భక్తులకు సరికొత్త అనుభూతిని మిగల్చనుంది. ఇప్పటికే భక్తులతో మేడారం జనసంద్రంగా మారింది. కాగా వనదేవతల్లో ఒకరైన సమ్మక్క కూతురు సారలమ్మ, సమ్మక్క భర్త పగిడిద్దరాజు, ఆయన తమ్ముడు గోవిందరాజులు రాకతో మహాజాతరకు తెరలేవనుంది.



పల్లె వెలుగు జనవరి 27

# గ్రూప్-2 ఫలితాలు నేడే

APPSC

పల్లె వెలుగు



-చంద్రబాబు

## డబ్బుతోనే రాజకీయం చేయలేం!

అమరావతి, పల్లె వెలుగు

# తిరుమలలో రథసప్తమి రికార్డ్

●సమష్టి కృషితో వేడుకలు విజయవంతం: టీటీడీ ఈవో
●9 ప్రశ్నలతో భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ
●ఏర్పాట్లు చాలా బాగున్నాయంటూ 97 శాతం మంది ప్రశంస



**తిరుమల, జనవరి 27 పల్లె వెలుగు**

ఎన్నడూలేని విధంగా ఈసారి రథసప్తమి రోజున తిరుమల మాడవీధుల్లో వాహనసేవలను రికార్డుస్థాయిలో 3.45 లక్షల మంది భక్తులు వీక్షించారని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. రథసప్తమి నిర్వహణపై మంగళవారం మధ్యాహ్నం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన తిరుమలలో మీడియాతో మాట్లాడారు. రద్దీ నిర్వహణ, భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని విభాగాల సమన్వయంతో సఫలీకృతమయ్యామని చెప్పారు. రథసప్తమి వేడుకలు విజయవంతం కావడానికి కృషి చేసిన టీటీడీ, జిల్లా, పోలీసు యంత్రాంగం, ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, అర్చకస్వాములు, వాహన బేరర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈసారి రథసప్తమికి భారీగా భక్తులు తిరుమలకు వచ్చారని.. గరుడ సేవను 1.80 లక్షల మంది వీక్షించినట్టు ఏఐ కెమెరాల ద్వారా గుర్తించామని తెలిపారు. ఇదే మాడవీధుల గ్యాలరీల అసలైన సామర్థ్యంగా చెప్పుకోవచ్చన్నారు. 24వ తేదీ నుంచి 25వ తేదీ రాత్రి వరకు టీటీడీ సౌకర్యాలను వినియోగించుకుంటూ భక్తులెవరూ కదలకుండా ఒకే ప్రాంతంలో ఓపిగ్గా కూర్చుని వాహనసేవలను వీక్షించారని ఈవో వెల్లడించారు.

## ఐదు రోజుల పనిదినాలు కావాలి

పల్లె వెలుగు జనవరి 27

**విజయవాడ అర్బన్ నెల్లూరు(హరనాథపురం), జనవరి 27**

బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఒక్క రోజు సమ్మె చేపట్టడంతో మంగళవారం బ్యాంకు కార్యకలాపాలు స్తంభించాయి. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ నాయకుల పిలుపు మేరకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎవీఫబీయూ) ఏపీ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూఎవీఫబీయూ ప్రతినిధి, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.ఎవీస.ఆర్.రాజశేఖర్ మాట్లాడుతూ 2015లో జరిగిన ఒప్పందం ప్రకారం 2, 4వ శనివారాలను సెలవులుగా ప్రకటించారని, మిగతా శనివారాలను కూడా సెలవులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని అప్పట్లో ఇచ్చిన హామీ ఇంకా అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో అమరావతి సర్కిల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.కాశీవిశ్వనాథ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమ్మెలో 9 యూనియన్లకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.





## రాహుల్‌గాంధీతో షర్మిల భేటీ

న్యూఢిల్లీ, జనవరి 27 పల్లె వెలుగు

# అమరావతికి చట్టబద్ధత కల్పించాలి

పల్లె వెలుగు

●పార్లమెంటు అఖిల పక్ష సమావేశంలో టీడీపీపీ నేత లావు
●ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం
●ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రి వంటి వారే స్వయంగా హోదాల నుంచి తప్పుకోవాలి.
●ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ(టీడీపీపీ) నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు.

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

బుధవారం 28-01-2026


## ఘనంగా క్రాంతి వీర సంగోళ్లి రాయన్న వర్ధంతి




**హోళగుంద పల్లె వెలుగు జనవరి 27**

మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో క్రాంతి వీరుడు సంగోళ్లి రాయన్న వర్ధంతి వేడుకలను కురువ సంగం యువకులు ఘనంగా జరుపుకున్నారు. భారత రాజ్యాంగంలోకి వచ్చిన రోజు స్వతంత్ర సమరయోధుడు సంగోళ్లి రాయన్న వర్ధంతి జరుపుకుంటున్నట్లు కురువ సంగం యువకులు తెలిపారు. గ్రామంలోని బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటుచేసిన సంగోళ్లి రాయన్న బోర్డుకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువకులు మాట్లాడుతూ భారతీయ సైనిక నాయకుడు. ఆయన బెళగావి జిల్లాలోని సంగొళ్ళిలో జన్మించాడు. ఆయన తండ్రి భరమప్ప రోగన్నవర్. ఆయన తల్లి కెంచవా. 19వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటిష్ రాజ్యంగా పిలిచే ఇతర రాజ్యాల మాదిరిగానే కిత్తూరు చెన్నమ్మ పాలించిన కిత్తూరు సైన్యంలో సీనియర్ కమాండర్ గా ఆయన పనిచేసాడు. 1824లో ఇఐసి అపఖ్యాతి పాలైన డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ కు ప్రతిస్పందనగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటుకు చెన్నమ్మ నాయకత్వం వహించిన తరువాత, రాయన్న భారతదేశంలో కంపెనీ పాలన వ్యతిరేకించడం కొనసాగించాడు. ఈస్టిండియా కంపెనీ అధికారానికి వ్యతిరేకంగా మరొక తిరుగుబాటుకు నాయకత్వం వహించిన తరువాత, చివరికి బ్రిటిష్ వారు అతన్ని బంధించి, 1831 జనవరి 26న సంగోళ్లి రాయన్న ఉరితీశారు. భారత స్వాతంత్ర్యంలో ఆయన చాలా ముఖ్యమైన పాత్ర పోషించినందున, ఆయన స్మారక విగ్రహాన్ని బెలగావి సంగొళ్ళి గ్రామంలో నిర్మించారన్నారు. నివాళులు అర్పించిన అనంతరం టపాసులు పేల్చారు.

## విద్యార్థుల యోగాసనాలు-ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు









**హోళగుంద పల్లె వెలుగు జనవరి27**

మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో జిల్లా పరిషత్, మండల ప్రజాపరిషత్, పాఠశాలల్లో, సచివాలయం లో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు చేసిన యోగ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఆరుబోట్ల నాగమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుగా జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం జనవరి 26ను భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుతారు. 1950 జనవరి 26న భారత ప్రభుత్వ చట్టానికి బదులు భారత రాజ్యాంగం దేశపరిపాలనకు మార్చడాన్ని భారత గణతంత్ర దినోత్సవం అంటారు. భారత రాజ్యాంగ సభలో 1949 నవంబరు 26న రాజ్యాంగం ఆమోదం పొందగా భారతదేశం స్వతంత్ర గణతంత్రంగా ఆవిర్భవించేందుకు 1950 జనవరి 26లో దీనిని ఒక ప్రజాతంత్ర పరిపాలన పద్ధతితో పాటుగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## దత్తపీఠంలో ఆధ్యాత్మిక వైభవం దేశభక్తి ప్రతీకగా గణతంత్ర వేడుకలు!







**-శ్రీ విజయానంద తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

**-కనులపండువగా శ్రీ సూర్యనారాయణ స్వామివారి కళ్యాణ మహోత్సవం**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

అవధూత దత్తపీఠంలో సోమవారం ఆధ్యాత్మికత, దేశభక్తి కలగలిసి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో, క్షేత్రంలో శ్రీ సూర్యనారాయణ స్వామివారి సప్తమ వార్షికోత్సవ రథసప్తమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆధ్యాత్మికం.. దేశభక్తి:శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో, పీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. పీఠం ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, భక్తులకు దేశభక్తి స్ఫూర్తిని రగిలించారు. దైవభక్తితో పాటు దేశభక్తిని కలిగి ఉండడమే నిజమైన సంస్కారం అని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు.వైభవంగా శ్రీవారి కళ్యాణం:రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో కొలువైన శ్రీ ఛాయా ఉషా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారికి శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవం జరిపించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ జరిగిన ఈ వేడుకను భక్తులు తిలకించి పులకించిపోయారు. అనంతరం స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పీఠం అంతటా భక్తులకు తీర్థప్రసాదాల వితరణ ఘనంగా సాగింది.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సిఐటియు





**ఆదోని (పల్లె వెలుగు):**

దేశ వ్యాప్తంగా ఆల్ బ్యాంక్స్ ఉద్యోగుల కు 5 రోజుల పని విధానం ను అమలు చేయాలి.ఆదోనిలో సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియు పట్టణ కమిటీ నాయకులు. సమ్మెలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు. కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులకు 5 రోజుల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ నందు జరిగినటువంటి సమ్మె సభలో బ్యాంకు ఉద్యోగులు తోపాటు సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న. సిఐటియు పట్టణ సాయ కార్యదర్శి లక్ష్మన్న మీరు మాట్లాడుతూ సంవత్సరం క్రితం ఒప్పందం చేసుకున్న ఐదు రోజుల పని ,విధానాన్ని అమలు చేస్తామని ఫైనాన్స్ కమిషనర్ కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నేటికి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా అమలు చేసి బ్యాంకు ఉద్యోగుల న్యాయం అయిన డిమాండ్ ను పరిష్కరించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు ఉచ్చురప్ప, ముని, తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ డెమోక్రాట్స్ దేశవ్యాప్త విస్తరణ అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర సంఘటన కమిటీల ఏర్పాటు

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

**అడ్వొకేట్ రేణు దేవి సింగ్.**





సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్ డి పి ఐ) యువజన విభాగమైన యంగ్ డెమోక్రాట్స్ ను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు అన్ని సాధ్యమైన రాష్ట్రాల్లో రాష్ట్ర సంఘటన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు యంగ్ డెమోక్రాట్స్ జాతీయ కన్వీనర్ అడ్వొకేట్ రేణు దేవి సింగ్ ప్రకటించారు.జనవరి 22, 2026 న మంగళూరులో విజయవంతంగా నిర్వహించిన మొదటి జాతీయ సంఘటన కమిటీ సమావేశం అనంతరం ఆమె ఈ ప్రకటన చేశారు.మీడియాతో మాట్లాడుతూ అడ్వొకేట్ రేణు దేవి సింగ్, జాతీయ సంఘటన కమిటీ సమావేశం యంగ్ డెమోక్రాట్స్ కు ఒక చారిత్రాత్మక ఆరంభమని, జాతీయ స్థాయిలో క్రమబద్ధమైన,ప్రజాస్వామ్యాత్మకమైన మరియు క్రమశిక్షణతో కూడిన యువజన ఉద్యమానికి బలమైన పునాది వేసిందని తెలిపారు. అదే విధంగా యంగ్ డెమోక్రాట్స్ దృష్టిని గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు, ప్రాంతీయ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, ఒకే ప్రజాస్వామ్య విలువలతో పనిచేసే రాష్ట్ర సంఘటన కమిటీల ఏర్పాటు తదుపరి ముఖ్యమైన కార్యాచరణగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.“రాష్ట్ర సంఘటన కమిటీల ఏర్పాటు ద్వారా యంగ్ డెమోక్రాట్స్ నిజమైన జాతీయ యువజన ఉద్యమంగా ఎదుగుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో యువత ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం దీనివల్ల ఏర్పడుతుంది” అని ఆమె అన్నారు.ఈ కమిటీలు కేడర్ అభివృద్ధి, రాజకీయ అవగాహన, సమస్యల ఆధారిత ఉద్యమాలు మరియు యువతలో ప్రజాస్వామ్య నాయకత్వ నిర్మాణంపై దృష్టి సారిస్తాయని వివరించారు.నేటి భారతదేశంలో సూత్రబద్ధమైన, విలువలపై ఆధారపడిన యువజన సంస్థ అత్యవసరమని అడ్వొకేట్ రేణు దేవి సింగ్ పేర్కొన్నారు.“డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక ప్రజాస్వామ్య ఆలోచన రాజకీయ ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం, సమానత్వం, సోదరభావం మరియు ప్రతి ఒక్కరి గౌరవంతోనే నిలబడగలదన్న భావన యంగ్ డెమోక్రాట్స్ కు ప్రేరణ” అని ఆమె తెలిపారు.“అసమానతలు, భయం మరియు అణచివేత పెరుగుతున్న ఈ కాలంలో, రాజ్యాంగ విలువలు మరియు సమగ్ర ప్రజాస్వామ్యాన్ని ధృఢంగా కాపాడే యువజన ఉద్యమం దేశానికి అవసరం” అని ఆమె అన్నారు. అధికారవాదం మరియు మత విభజనకు వ్యతిరేకంగా న్యాయం, శాంతి మరియు ప్రజాస్వామ్య ప్రతిఘటనకు కట్టుబడి ఉన్న సామాజికంగా చైతన్యవంతమైన కొత్త తరం యువ నాయకులను తయారు చేయడమే యంగ్ డెమోక్రాట్స్ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు, వృత్తి నిపుణులు మరియు సామాజిక కార్యకర్తలు రాష్ట్ర సంఘటన కమిటీల ఏర్పాటులో భాగస్వాములై, సామాజిక మార్పుకు అంకితమైన బలమైన ప్రజాస్వామ్య యువ వేదికను నిర్మించేందుకు ముందుకు రావాలని జాతీయ కన్వీనర్ పిలుపునిచ్చారు.

## లింగాపురం లో ఎంపీడీవో

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు జనవరి 27 :**



బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గాయత్రి మంగళవారం లింగాపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బందికి సంబంధించిన అటెండెన్స్ను పరిశీలించారు పెండింగ్లో ఉన్న వివిధ సర్వేలకు సంబంధించి సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు యు ఎఫ్ ఎస్ సర్వే ను తనిఖీ చేశారు. ఎన్ఆర్జిఎస్ పనులకు సంబంధించి శ్రామికులు ఎక్కువ శాతం లో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ కు ఆదేశాలు జారీ చేశారు. సాలీడు వేస్ట్ మేనేజ్మెంట్ కు సంబంధించి లింగాపురం గ్రామపంచాయతీ నందు షెడ్డు పని జరిగేటట్లు తగు చర్యలు తీసుకోవాలని గ్రామంలోని వేస్ట్ చెత్త అంతా షెడ్డుకు తరలించాలని పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు కు సూచించారు.

బుధవారం 28-01-2026

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1



# ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

**30న సామూహిక సత్యాగ్రహ దీక్షలు.**
**నిరుపేదల ఆర్థిక భరోసాపై మోదీ ప్రభుత్వం దెబ్బ.**
**పాత చట్టం కోసం పోరాడుతాం. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్.

దేశంలోని నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశముజిల్లా అధ్యక్షుడు కె. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ, గత యూపీఏ ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని 100 రోజుల పనిదినాలు, కనీస వేతనంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఈ పథకం వల్ల వెనుకబడిన వర్గాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి, పేద ప్రజలు బ్యాంకుల మెట్లు ఎక్కగలిగారని రిజర్వు బ్యాంకు సైతం ప్రశంసించిందన్నారు. అయితే, ఈ పథకం వల్ల తమకు నష్టం కలుగుతోందని భావిస్తున్న భూస్వామ్య, కార్పొరేట్ శక్తుల ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్పు, నూతన చట్టాలను తీసుకువచ్చిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూకేంద్రం నిర్ణయం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందని, తక్షణమే నూతన చట్టాన్ని ఉపసంహరించుకుని పాత చట్టాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఈ నెల 30న రాష్ట్రవ్యాప్త సామూహిక సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అలాగే పది రోజుల పాటు వాడవాడలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫిబ్రవరి 9న రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు.



రాజ్యాంగబద్ధంగా సాధించుకున్న పథకాన్ని నీరుకార్చడం అత్యంత దుర్మార్గమని, గతంలో కేంద్రమే 90 శాతం నిధులు భరించేదని, ఇప్పుడు 40 శాతం వాటా రాష్ట్రాలపై వేయడం పథకాన్ని అడ్డుకోవడమేనని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో నిధుల కోత విధించడం, పనిముట్లు సరఫరా చేయకపోవడం వంటి చర్యల ద్వారా పేదలను పథకానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మౌనం వహించడం దారుణమన్నారు. వలసల నిరోధానికి దోహదపడే ఈ చట్టాన్ని కాపాడుకోవడానికి అన్ని పక్షాలను ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్. సంజీవులు నారాయణ జి హరినాథ్. జిల్లా నాయకులు. రామ్మోహన్. నాగరాజు. లక్ష్మయ్య., సూర్యనారాయణ.వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

**డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం.ఆదోనిలో నూతన జాబ్ క్యాలెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని గర్జించిన విద్యార్థి లోకం.**





ఆదోని (పల్లె వెలుగు):

ఈరోజు ఆదోని పట్టణంలో డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్(డి.ఎస్.ఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక బీమాస్ కూడలి నందు నూతన జాబ్ క్యాలెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలి అని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ రాష్ట్ర కార్యదర్శి బాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నేడు మాట తప్పి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని వారు మాట్లాడారు. ఉద్యోగాలు లేని నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పినటువంటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తా ఉన్నప్పటికీ నిరుద్యోగ భృతి కూడా, ఇవ్వకుండా నిరుద్యోగులకు పూర్తిగా అన్యాయం చేస్తున్నారని వారు తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసినటువంటి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదలి రండి అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించడం జరుగుతుంది. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి హెచ్చరిస్తున్నాం తక్షణమే నూతన జాబ్ కాలండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘంగా డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో డిఎస్ఎఫ్ నాయకులు నవీన్ రాజేష్ వినోద్ నవీన్ సుకుమార్ రాజు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యను వ్యాపారం చేయడం కోసమే వికసిత భారత్ శిక్షా అధిష్టాన్




**యు ఎస్ ఎఫ్ ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మాదం తిరుపతి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాదం తిరుపతి హాజరు అయ్యారు. రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక సునీత వొకేషనల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను వ్యాపారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ శిక్షా అధిష్టాన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని ఆయన అన్నారు. దేశంలో వైద్య, న్యాయవిద్య మినహా మిగిలిన అన్ని ఉన్నత విద్యాసంస్థలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే కుట్ర చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన విద్య అనేక మందికి దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా విద్యార్థులు మేధావులు ప్రజాసంఘాల నాయకులు దేశ ప్రజానీకం కలిసికట్టుగా వ్యతిరేకించాలని కోరారు. ఈ అధిష్టాన్ విధానం వల్ల ఇతర సంస్థల పేర్లను రద్దుచేసి విద్యను ఒక వర్గం చెందిన రాజకీయ దృక్పథాన్ని తెలియజేయడానికి ఉపయోగపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న పేర్ల మార్పు పై శ్రద్ధ పెట్టకుండా ఉన్నత విద్యాభివృద్ధి కోసం నాణ్యమైన విద్య ప్రమాణాలతో కూడిన విద్య అందించడం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. తగిన బడ్జెట్ కేటాయించని కేంద్ర ప్రభుత్వం పేర్ల మార్పుతో ఏం సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు . విద్యారంగా అభివృద్ధి కోసం భవిష్యత్తులో దేశ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం తక్షణమే సంక్షేమ హాస్టల్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ లను మంజూరు చేయాలని కోరారు. అనేక సంక్షేమ హాస్టళ్లకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నారు. అదేవిధంగా మార్కుల కోసం ర్యాంకుల కోసం విద్యార్థులను వేధించే విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను సమయ పాలన లేకుండా వేధించే విద్యాసంస్థలపై విచార జరపాలని కోరారు. ఈ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సందెపోగు ఉదయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు పవన్, నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్యన్, సందీప్, రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్,కిషోర్, అభి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం

**-ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జనవరి 27 :

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజాభిమానాన్ని సంపాదించుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం వెలుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన ఎక్సరే యూనిట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో తిరిగి పేషంట్లకు అందుతున్న సేవలను గురించి విచారించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రాంగణంలో పలుచోట్ల సిమెంటు రోడ్ల నిర్మాణం చేయించాలని వైద్యాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే మంజూరు చేయించి సౌకర్యాలను కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ అసౌకర్యంగా ఉందని, దాన్ని ఆసుపత్రిలో పై అంతస్తుకు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇప్పించాలని కోరారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ ఆస్పత్రి వైద్య బృందం అందించే సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో పాటు పలు శాఖలకు చెందిన వైద్యాధికారులు అమూల్య,ప్రదీప్,ఇక్రమ్ అలీ ఖాన్, సులోచన, భాను ప్రకాష్ఠ,దావలి తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు మోగిన నగారా

పల్లె వెలుగు

మున్సిపల్ ఎన్నికలకు నగరా మోగింది. మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ల ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదుని మంగళవారం ప్రకటించింది. జిల్లాలో మొత్తం ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 136 వార్డు కౌన్సిలర్ల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జగిత్యాల మున్సిపల్‌లో 50 వార్డులు, రాయికల్‌లో 12 వార్డులు, ధర్మపురిలో 15 వార్డులు, కోరుట్లలో 33 వార్డులు, మెట్‌పల్లిలో 26 వార్డు కౌన్సిలర్ల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. జనవరి 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 1వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు అప్పీళ్ల స్వీకరణ, ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అప్పీళ్లను పరిష్కరిస్తారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1
బుధవారం 28-01-2026

## నంద్యాల కవి, సమద్ కు హైదరాబాద్ రవింద్ర భారతి కవి సమ్మేళనంలో ఘన సత్కారం





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
హైదరాబాద్ రవింద్ర భారతిలో జనవరి 26న ఇస్లామి సాహిత్య వేదిక, తెలంగాణా వారు నిర్వహించిన కవి సమ్మేళనంలో నంద్యాల కవి, ఆ.ప్ర ముస్లిం రచయితల సంఘం ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ ప్రవక్త ముహమ్మద్ హితబోధ అన్న అంశం పై కవిత వినిపించారు. అనంతరం శ్రీ సమద్ ను ముఖ్య అతిథులు శాలువా కప్పి, మెమోంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు .ఈ కవి సమ్మేళనానికి అబు నబీల్ ఖాజాహుసేన్, దక్షిణ భారత ఇదారా అదబి ఇస్లామియా అధ్యక్షత వహించారు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, విమర్శకులు, అధ్యక్షులు తెలంగాణ రచయితల సంఘం శ్రీ నాగేశ్వరరావు శంకరం, ఆచార్య పి. గౌరి శంకర్ పూర్వ రిజిస్ట్రార్ తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ , కళాసింధు, ట్యాగ్ కింగ్ ఆలపాటి, శ్రీమతి గిడుగు క్రాంతి క్రిష్ణా, ఛైర్మన్ గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర దృష్టి

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**దయల్ యువర్ కమిషనర్‌కు 27 ఫిర్యాదులు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :
కర్నూలు నగర ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా అధికారులు నిరంతరం దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో వివిధ కాలనీలకు సంబంధించిన రహదారులు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, మరమ్మత్తులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై 27 ఫిర్యాదులను స్వీకరించారు.వాకిటాకి ద్వారా సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను తెలుసుకుని, సమస్యల పరిష్కార మార్గాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, డిసిపి అంజాద్ బాషా, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక పురోగతిని పెంచేదే విద్య

**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**






బండి ఆత్మకూరు పల్లె వెలుగు జనవరి 27 :
విద్య అనేది జ్ఞానం నైపుణ్యాలు విలువలతో పాటు అలవాట్లను అభ్యసించడం ద్వారా వ్యక్తిగత వికాసాన్ని సామాజిక పురోగతిని పెంచే ప్రక్రియ అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం వెలుగోడు లోని ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా పాల్గొని ప్రసంగించారు. మానవ మేధస్సును సానబట్టి సమాజానికి అవసరమైన బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేస్తుందని అన్నారు. విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే కాదని, అంతర్గత జ్ఞానాన్ని వెలికి తీయడం లాంటిది అన్నారు. విద్య అనేది వారసత్వం, సంస్కృతి,విలువలు మరియు భాషను ఒక తరం నుండి మరో తరానికి అందజేస్తుందని అన్నారు. వ్యక్తిగత జీవితాన్ని సన్మార్గంలో పెట్టడానికి సృజనాత్మకతను పెంచడానికి సహాయపడుతుందని అన్నారు. పాఠశాల జీవితం ప్రతి ఒక్కరి వ్యక్తిత్వం పైన ప్రభావం చూపుతుందని పుస్తకాలతో పాటు, క్రీడలు ఇతర విభాగాల్లోనూ సమాన ఆసక్తిని పెంచుకొని ప్రతి అంశంలోనూ నైపుణ్యం సాధించాలని విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. విద్యాభ్యాసంతో పాటు క్రమశిక్షణ సేవా భావాన్ని పెంపొందించుకోవడంలో ముందంజలో ఉండాలని పేర్కొన్నారు. అంతకుముందు ప్రధాన రహదారి నుంచి మోడల్ స్కూల్ వరకు నిర్మించ తలపెట్టిన నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. మైనార్టీ నాయకుడు వెలుగోడు యూనిట్ ఇంచార్జి డాక్టర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన జరుగుతూ ఉందని విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం కార్యక్రమంలో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ పథకం వర్తించేలా ప్రభుత్వం అవకాశాలను కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నారపు శేషారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ అబ్దుల్ కలాం, వెలుగోడు టిడిపి అధ్యక్షుడు రసూల్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నళిని, ఎస్ఐ సురేష్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాయుని చెరువులో చిరుత సంచారం







**-అప్రమత్తమైన అధికారులు**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జనవరి 27 :
నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న నాయిని చెరువు పరిసరాల్లో గత కొద్దిరోజులుగా చిరుత పులి సంచారం చేస్తూ ఉంది రాత్రిపూట గూడెంలో పడుకొని ఉన్న వీధి కుక్కలను వేటాడుతూ విందు చేసుకుంటూ ఉంది. ఈ సంఘటనతో చెంచుగూడెంలో గిరిజనులు భయంతో గిజగిజలాడిపోతున్నారు. తెలుగు గంగ కాలువ అవతలి వైపు చాలా సంవత్సరాల కాలం నుండి నాయుని చెరువు గూడెంలో నివాసం ఉంటూ ఉన్నారు. గూడానికి 50 మీటర్ల దూరంలోనే అటవీ ప్రాంతం నెలకొని ఉంది. గత దశాబ్ద కాలం నుండి అటవీ ప్రాంతం నుండి కలప రవాణా కాకుండా అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ ఉన్నారు. ఈ కారణంగా జనావాసం కూడా తగ్గిపోవడంతో పాటు అడవులు దట్టంగా పెరగటం వల్ల చిరుతపులుల సంతతి కూడా బాగా పెరిగిపోయిందని తెలుస్తోంది. నీటి సౌకర్యం కూడా పుష్కలంగా ఉండటంతో చిరుతపులులు గ్రామాలకు సమీపంలోనే సంచరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే చిరుత పులి ఒకటి చెంచుగూడెంలో రాత్రి వేళల్లో ప్రవేశించి కనపడిన కుక్కలను వేటాడుతూ ఉంది. ఈ సంఘటన వెలుగులోకి రావడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. చిరుత పులి సంచారం పై అటవీ అధికారులు పలువురు గిరిజనులను విచారించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝూ ఆదేశాల మేరకు ఫారెస్ట్ శిక్షణ ఆఫీసర్ నాగరాజు, గార్డు హైమావతి గూడెంలో రెండు కోల్డ్ బ్యాగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాల ఏర్పాటు వల్ల చిరుత పులి సంచారాన్ని గుర్తించే వీలుంటుందని అటవీ అధికారులు పేర్కొంటున్నారు.

**గూడెంలో వీధిలైట్లు ఏర్పాటు**

చెంచుగూడెంలో అధికార యంత్రాంగం మంగళవారం వీధి లైట్ల సౌకర్యాన్ని కల్పించింది. వారం రోజుల క్రితమే రాష్ట్ర ఎస్టీ కమిషన్ వెంకటప్ప వెలుగోడు లో గిరిజనులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన నేపథ్యంలో గిరిజనులు గూడెంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషన్ దృష్టికి తెచ్చారు. కమిషన్ సభ్యుడు ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం ఇన్చార్జి కార్యదర్శి శ్రీకాంత్ చెంచుగూడెంలో పర్యటించారు.గూడెంలో ఎల్ఈడి విద్యుత్ బల్బుల సౌకర్యాన్ని కలిగించారు. గూడెంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని నిర్మూలించేందుకు గడ్డి మందును పిచికారి చేయించారు.

# విద్య యొక్క విలువను గుర్తించండి, అది మీ ఉజ్వల భవిష్యత్తుకు పునాది:రవీంద్రారెడ్డి



కాశి నాయన జనవరి 27 ( పల్లె వెలుగు)
కాశినాయన మండలం నరసాపురం మోడల్ స్కూల్లో మంగళవారం ఫేర్వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అధైర్య పడకుండా ధైర్యంగా ఒక దృఢ సంకల్పంతో పరీక్షలు రాసి కన్న తల్లిదండ్రులకు పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను అభివృద్ధి చేసేందుకే రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకొని విద్యావ్యవస్థలో నూతన వరవడులు సృష్టిస్తూ విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి మన తల్లిదండ్రులు ఏ విధంగా కష్టపడుతున్నారనే అంశాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడే విజయం సాధించిన వాళ్ళమవుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి మంచి గుర్తింపుతో పాటు ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలను సాధించే అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లా, రాష్ట్ర,దేశ ఉన్నతాధికారులుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఇటీవల కడప జిల్లాకు చెందిన యువ మహిళ అయినా శ్రీ చరణి ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్రంలోనే కాకుండా దేశ క్రికెట్ జట్టులో పాల్గొని మన జిల్లాకు,రాష్ట్రానికి ఎంతో పేరు తీసుకొచ్చిందన్నారు. ఆమెకు క్రీడల్లో ఉన్న దృఢ సంకల్పమే మన దేశం తరఫున క్రికెట్ ఆడి విజయం సాధించడంతో ఈరోజు ఒక ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టింది అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇటీవల మోడల్ స్కూల్ ను సందర్శించి మౌలిక వసతులు లేవని గుర్తించి వెంటనే వాటి పరిష్కారం చూపమన్నారు. అతి త్వరలో విద్యార్థులకు సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ షఫీ, ప్రిన్సిపాల్ సౌజన్య, స్థానిక టిడిపి నాయకులు పోలిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శంకర్,విద్య కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్,అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతీయ దిన పత్రిక  అవినీతిపై నిఘా  GST No.37ACDFM5465G1Z1  RNI-APTEL/2012/46499

# రాష్ట్రస్థాయి దివ్యాంగ క్రీడలలో నంద్యాల జట్టు

**నెల్లూరులో రాష్ట్ర స్థాయి పారా స్పోర్ట్స్ లో పాల్గొంటున్న గౌతమ్,నవీన్,ఇమ్రాన్, శ్రీనివాసులు.**

**నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం తరపున క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందజేసిన డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
నెల్లూరులో ఏ.సీ. సుబ్బారెడ్డి స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ ( దివ్యాంగ క్రీడలు) అథ్లెటిక్ పోటీలలో రుద్రవరం కు చెందిన గౌతమ్ ( జావలిన్, షాట్ పుట్), ఆత్మకూరు కు చెందిన ఇమ్రాన్ ( షాట్ పుట్, జావలిన్, లాంగ్ జంప్), వెంకటేశ్వరపురం కు చెందిన నవీన్ ( 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్ పుట్), చిందుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ( డిస్కస్ త్రో, జావలిన్) నంద్యాల జిల్లా తరపున పాల్గొంటున్నారు. వీరు గతంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించడం జరిగింది. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం తరపున అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి ఎం.పి.వి.రమణయ్య వీరిని సత్కరించి 6 వేల రూపాయల ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో క్రీడలలో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన క్రీడా పాలసీలో పారా స్పోర్ట్స్ లో వివిధ స్థాయిలలో సాధించిన విజయాల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలు కేటాయిస్తున్నారని అన్నారు. నెల్లూరులో ఈ నలుగురు పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించడంతో పాటు నెల్లూరు లో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మాఘం గౌతం సహకారంతో వసతి సౌకర్యం కూడా కల్పించడం జరిగిందని తెలిపారు. దివ్యాంగులు క్రీడలలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు ముందుకు వస్తే వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసి ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జిల్లా పారా స్పోర్ట్స్ కార్యదర్శి ఎం. పి.వి. రమణయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల కోసం వెంకటేశ్వర స్వామిని వాడుకున్నది ఎవరు! మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి సూటి ప్రశ్న!



పోరుమామిళ్ల జనవరి 27 ( పల్లె వెలుగు)
ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో మాట్లాడుతూ ఎవరైనా వెంకటేశ్వర స్వామికి అపచారం తలపెట్టి తే . వచ్చే జన్మలో కాదు. ఈ జన్మలోనే పనిష్మెంట్ ఇస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డులో. పంది కొవ్వు. జంతువుల కొవ్వు. చాప నూనె. అపవిత్రంగా వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో. గత ప్రభుత్వాల్లో వాడారు అని. ఇలాంటి దుర్మార్గులను. ఏమి చేయాలో ఒకసారి బాద. ఆవేదన .కలుగుతుందని. కక్కుర్తి కూడా హద్దులు ఉంటాయని. రాజకీయం కోసం వెంకటేశ్వర స్వామిని వాడుకోవడం భావ్యం కాదని. హిందువుల అందరూ. ఒకసారి అయినా వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలని వస్తారు అని. అటువంటి వారి మనోభావాలను. దెబ్బతీశారని. చంద్రబాబు గారు విమర్శించడం జరిగింది. ఇప్పుడు సుప్రీంకోర్టు సిబిఐ . చార్ సీట్ లో. జంతువుల కొవ్వు కానీ. చేపల నూనె. కానీ కలవలేదని రిపోర్టు సుప్రీంకోర్టుకు. ఇవ్వడం. దీనికి. సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై సీరియస్ కావడం జరిగింది. టీ.టీ.డీ తరపున సిద్ధార్థ లుథ్ర ను. జడ్జిగారు నెయ్యిలో కల్తీ జరిగిందా అని అది ఏ ఆధారంగా చెప్పారు అని అడుగుగా. కల్తీ జరగలేదని చెప్పారు. లడ్డులో కల్తీ జరిగినట్లు ఏ ల్యాబ్ రిపోర్ట్ ఇచ్చింది అని. అడగ్గా దానికి సమాధానం లేదు. ముఖ్యమంత్రి గా రాజ్యాంగబద్ధంగా ఉండి బాధ్యతాయుతంగా మాట్లాడకుండా ఇలా విమర్శించడం సరికాదని సుప్రీం కోర్టు. కూటమి ప్రభుత్వాన్ని. నిలదీసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. నేను సనాతన హిందువుని. జంతువుల కొవ్వు కలిపిన ప్రసాదాలను వెంకటేశ్వర స్వామికి నైవేద్యంగా పెడతార అని. అదే ప్రసాదాలు అయోధ్య రామునికి ఒక లక్ష లడ్లు పంపిస్తారా. ఇలాంటి స్థాయిలో రిపోర్టు వచ్చినప్పుడు ఏం చేయాలి. అదే ముస్లిం మతంలోనూ. క్రిస్టియన్ మతంలోనూ. ఈ విధంగా జరిగి ఉంటే . ఏమి జరిగేదో. ఊహించుకోండి. హిందువులకు పౌరుషం లేదా. ధైర్యం లేదా. అని రెచ్చగొట్టే విధంగా. మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా మాట్లాడడం . మరి హిందూధర్మాన్ని కాపాడాలి . అందరి బాధ్యత అని వెంకటేశ్వర స్వామి మాల వేసుకుని తిరుమల లో ప్రక్షాళన పూజ నిర్వహించడం జరిగింది. వాస్తవాలను తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు ఆవేశంతో మాట్లాడడం. ఇప్పుడు సుప్రీంకోర్టు కు. ప్రజలకు ఏమని సమాధానం చెబుతారో చెప్పండి . బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి గారు మీరు ఏమని ప్రజలకుసమాధానం ఇప్పుడు చెప్తారు. ఈ ప్రభుత్వంలో ఈ.వో. ఐఏఎస్ అధికారి కూడా లడ్డులో కల్తీ నెయ్యి కలవలేదని వెనక్కి పంపామని చెప్పడం జరిగింది. ఇప్పుడు నీచ రాజకీయాల కోసం ఎవరు అబద్ధపు ప్రచారం చేశారు. ఇప్పుడు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి. ఎవరికి బుద్ధి చెబుతారో త్వరలోనే తెలుస్తుంది. ఇప్పుడు ప్రజలందరూ సోషల్ మీడియా ద్వారా వాస్తవ విషయాలను తెలుసుకోవడం జరిగిందని . అప్పుడు మాట్లాడిన ఎల్లో మీడియా. పత్రికలు.నాయకులు. ఇప్పుడు ఎవరు నోరు మెదపడం లేదు . అని నాగార్జున రెడ్డి గారు అన్నారు.

# రెవెన్యూ ఆదాయ లక్ష్యాలను వందశాతం అధిగమించాలి


**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
జిల్లాలో ప్రధాన ఆదాయ వనరులైన ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలకు కేటాయించిన వార్షిక ఆదాయ లక్ష్యాలను వందశాతం సాధించడమే కాకుండా అధిగమించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్‌తో పాటు ఎక్సైజ్, మైనింగ్, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదాయం సృష్టించే శాఖల్లో వనరుల సమర్థ వినియోగం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, లక్ష్య సాధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుంటూ ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. మైనింగ్ శాఖకు సవరించిన ఆర్థిక లక్ష్యం రూ.250.50 కోట్లుగా ఉండగా, డిసెంబర్ వరకు కేవలం రూ.178 కోట్లు మాత్రమే సాధించారని కలెక్టర్ తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని చేరుకునేందుకు మైనింగ్ శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో కృషి చేయాలని సూచించారు. వాణిజ్య పన్నుల శాఖలో గత ఏప్రిల్ నుండి జనవరి వరకు నిర్ణయించిన రూ.618.31 కోట్ల లక్ష్యానికి గాను రూ.496.02 కోట్లు మాత్రమే సాధించారని, ఇంకా సుమారు రూ.120 కోట్ల లక్ష్యం మిగిలి ఉన్నందున దానిని త్వరితగతిన సాధించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.రిజిస్ట్రేషన్ శాఖ విషయానికి వస్తే, రూ.202 కోట్ల లక్ష్యాన్ని మించి రూ.210 కోట్లు సాధించినట్లు అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. మార్చి నెలాఖరుకు ఈ ఆదాయాన్ని రూ.230 కోట్లకు పెంచగలమని సబ్-రిజిస్ట్రార్‌లు ఆశాభావం వ్యక్తం చేశారు. రవాణా శాఖ ద్వారా 202526 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు రూ.120.40 కోట్ల లక్ష్యానికి గాను రూ.88.42 కోట్లు మాత్రమే వసూలైనట్లు రవాణా శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన లక్ష్య సాధనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎక్సైజ్ శాఖకు కేటాయించిన రూ.1200 కోట్ల వార్షిక లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటూ రెవెన్యూ ఆదాయ శాఖల్లో వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# శ్రీశైలం టోల్ గేట్ వద్ద నగదు కలకలం



పల్లె వెలుగు శ్రీశైలం...
శ్రీశైల దేవస్థానం టోల్ గేట్ వద్ద పోలీస్ సిబ్బంది, దేవస్థానం సెక్యూరిటీ వాహనాల తనిఖీ లో భాగంగా బయటపడిన డబ్బుల కట్టలు అనుమానస్పదంగా పట్టుబడిన 30 లక్షల రూపాయల నగదు శ్రీశైలం పోలీసులకు అప్పగించిన దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు వాహనంలో నగదు కట్టలతో మహారాష్ట్రకు చెందిన కొంతమంది శ్రీశైలం వచ్చారు. టోల్గేట్ వద్ద దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు చేయగా అందులో 30 లక్షల నగదు లభించింది విషయం తెలుసుకున్న




శ్రీశైల దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ టోల్గేట్ వద్దకు చేరుకుని వారిని వివరాలు కోరగా తమది బంగారం వ్యాపారమని, శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చిమని తెలిపినట్లు వారు చెప్పిన మాటల్లో నిజం లేదని అనిపించి నగదు వాహనాన్ని శ్రీశైలం పోలీసులకు అప్పగించారు శ్రీశైలం పోలీస్ వారు ఆ వ్యక్తులను సరైన వివరాలు చూపించాలి అని కోరారు.

# నేడు శ్రీ సిద్దేశ్వర స్వామి మహారథోత్సవం

**ఆంధ్ర కర్ణాటక నుంచి భారీగా తరలి రానున్న భక్తులు**

**జాతరకు భారీ బందోబస్తు**





హొళగుంద జనవరి 27(తెలుగు ప్రభ )
హొళగుంద మండల ప్రజల ఆరాధ్య దేవుడిగా పూజింపబడుతున్న శ్రీ సిద్ధేశ్వరస్వామి మహారథోత్సవం నేడు జరగనుంది ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం లంక దహనం శుక్రవారం వసంతోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య ఆలయ ధర్మకర్తలు రాజా పంపన్న గౌడ్, భారత్ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు హెచ్ శివశంకర్ గౌడ తెలిపారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి భక్తులు విరివిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని స్వామి వారి ఆశీస్సులు పొంది శ్రీ సిద్ధేశ్వరస్వామి కృపకుపాత్రులు కావలెనని భక్తులను రాజాపంపన్న గౌడ్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం జరిగే రథోత్సవం కోసం సిఐ ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్సై దిలీప్ కుమార్ గురజాల తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశామని,భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగినా, తమకు వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.స్వామివారి జాతరను పురస్కరించుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని తెలిపారు. ఈరతోత్సవానికి కర్నాటక తదితర రాష్ట్రాలు,సుదూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు హాజరవుతారని తెలిపారు.

పల్లె వెలుగు
అవినీతిపై నిఘా
GST No.37ACDFM5465G1Z1
RNI-APTEL/2012/46499
బుధవారం 28-01-2026

# విద్యార్థులకు మహిళలపైజరిగే నేరాలపై నివారణ అవగాహన కార్యక్రమం





**సి బెళగల్ పల్లెవెలుగు జనవరి 17**

సి బెలగల్ గ్రామంలోని మంగళవారం బెలగల్ ఎస్సై వేణుగోపాలరాజు సామాజిక సంక్షేమ బాలికల/బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు మహిళలపై జరిగే నేరాలు నివారణ మరియు మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వ్యతిరేక అవగాహన అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళలపై జరుగుతున్న నేరాల రకాలు, వాటి వల్ల కలిగే సామాజిక–మానసిక దుష్పరిణామాలు, అలాగే ఇలాంటి నేరాలు ఎదురైనప్పుడు వెంటనే తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్ సహాయం పొందే విధానం గురించి వివరించారు. ముఖ్యంగా బాలికల భద్రత, చట్టపరమైన రక్షణలు, 112, 1091 వంటి హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాధాన్యతను తెలియజేశారు.అదేవిధంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబ జీవితం పై పడే తీవ్ర ప్రభావాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, చెడు అలవాట్లకు లొంగకపోవడం, మంచి స్నేహితులను ఎంచుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా, సమస్యలు ఎదురైనప్పుడు హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు లేదా పోలీసు శాఖను సంప్రదించాలని తెలిపారు. సమాజంలో చట్టంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా నేరరహిత సమాజాన్ని నిర్మించవచ్చని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొని విద్యార్థులను చైతన్యపరిచారు.

# సి బెలగల్ రైతు సేవ కేంద్రం నందు పోలం పిలుస్తుంది కార్యక్రమాశీ





**సి బెళగల్ పల్లెవెలుగు జనవరి 27**

సి.బెళగల్ మండలంలోని సి బెలగల్ –2 రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ పొలం పిలుస్తుందనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్లో సాగు చేస్తున్నటువంటి పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి కొర్ర పంటలను పరిశీలించడం జరిగినది. రైతు సోదరులు ఇప్పుడు సాగు చేస్తున్నటువంటి పంటలలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. అదేవిధంగా (ఏపీఎఫ్ఆర్ )రైతు విశిష్ట నమోదు సంఖ్యను ఇంకా ఎవరైనా నమోదు చేసుకుని వారు ఉన్నట్లయితే వారు ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్లో సాగు చేసినటువంటి కందులను ప్రభుత్వంకు మద్దతు ధర అమ్ముకోదలుచుకున్నవారు కచ్చితంగా రైతు సేవా కేంద్రంలోని ఇన్చార్జిలను సంప్రదించి కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఏఈఓ హిమబిందు ఆర్బికే ఇన్చార్జి ఆసిఫ్ రైతులు పాల్గొనడం జరిగినది.

# గిరిజన ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ







**మహానంది, పల్లె వెలుగు**

మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు, వసతి గదులు, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా, భోజనం, వసతి, విద్య సంబంధిత ఇబ్బందులు ఏమైనా ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, భోజన ఏర్పాట్లు, పారిశుద్ధ్య పరిస్థితులపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు.

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర నియంతరణకు కృషి చేయండి

**రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించండి.**
**జిల్లా పోలీసు అదికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ జిల్లా పోలీసు అదికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి సమీక్షా(రివ్యూ) నిర్వహించి నేరనియంత్రణకు,పెండింగ్ కేసుల దర్యాప్తు, నేరస్థులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సుధర్శన్, గాండీవ,మొదలగు వాటిని ఉపయోగించుకోవాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ల వారీగా యు ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు.నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. మహిళల భద్రత,సైబర్ క్రైమ్,శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు.వాటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. బీట్లు, పికెట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తరచూ నేరాలకు పాల్పడేవారిపై పి.డి యాక్ట్ ఉపయోగించి జిల్లా బహిస్కరణకు చర్యలు తీసుకోవాలి.శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా విధులు నిర్వహించాలి.భౌతిక దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే రోడ్డు రవాణా సంస్థ,ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో నియంత్రణ చర్యలు చేపట్టాలి.మహిళలు భద్రత కొరకు వారు ఎక్కువగా సంచరించు ప్రదేశాలలో ప్రత్యేక దృష్టి ఉంచి పెట్రోలింగ్ పెంచడంతో పాటు నిఘా కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.కాలేజీలు ,వసతి గృహాలు మరియు ప్రార్ధన ఆలయాలు చర్చి ,మసీదు ,దేవాలయ పరిసర ప్రాంతాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు, ఎం. జావళి ఆల్ఫోన్స్ ఐపీఎస్, ప్రమోద్ , రామంజి నాయక్ , శ్రీనివాస్ , స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం



**గూడూరు పల్లెవెలుగు జనవరి 27**

గూడూరు,బెలగల్ మండలాల్లోని సిపిఎం పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం గూడూరులోని సిఐటియు కార్యాలయంలో జరిగింది,ఈ సమావేశానికి సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జే,మోహన్ అధ్యక్షతన జరిగింది, సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి.నారాయణ మాట్లాడుతూ.దేశంలో కానీ,రాష్ట్రంలోకానీ ప్రజలకి సేవ చేసే విధంగ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు లేవని,కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు ఊడిగం చేయడానికి ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లని తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న, చట్టాలను తీసేసి బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొని వచ్చి ఎనిమిది గంటల పని విధానానికి బదులు 12 గంటల పని విధానాన్ని అమలు చేసి కార్మికులందరినీ బానిసలుగా చేయడానికి చూస్తున్నదని, ఇప్పటికే కార్మికులలో అభద్రత భావం నెలకొన్నదని, దీనికి తోడు లేబర్ కోడ్ వలన మరింత ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వం గురి చేస్తున్నదని, అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వేసవికాలంలో కడుపునిండా అన్నం పెట్టే జాతీయ ఉపాధి హామీ పథకం చట్టాన్ని మార్చి ఆ స్థానంలో విబిజి రాంజీ అనే కొత్త చట్టాన్ని తెచ్చి ఉపాధి కూలీలను మరింత పేదరికంలోకి నెట్టే పరిస్థితి కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని, గత చట్టంలో ఉపాధి కూలీలు పనులు అడిగిన వెంటనే పనులు పెట్టే విధంగా చట్టంలో ఉన్నదని,, కానీ ప్రస్తుత చట్టంలో కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పుడే ఉపాధి పనులు పెట్టే పరిస్థితి ఉన్నదని, ఈ విధానాల వలన గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఆస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించక పోవడంతో వలసలు వెళ్తున్నారని, గూడూరు బెలగల్ మండలాల్లో ఇప్పటికే వలసలు వెళ్లారని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకుండా దాన్ని అమలు చేయడానికి చూస్తున్నదని, అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కార్మిక, వ్యవసాయ కూలీ, రైతు సంఘాలు ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, ,సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పే విధంగా సమ్మె జరగాలని,ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని ఆయన అన్నారు, కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, కోటయ్య, ఖాజా హుస్సేన్, పార్టీ సభ్యులు సుందర్ రాజు, మాధవ కృష్ణయ్య, రామాంజనేయులు, నాగరాజమ్మ, రాముడు, రంగన్న, భాస్కర్, రంగడు, రమేష్, ఉపేంద్ర,కే, రాజు,మరియు గూడూరు బెలగల్ మండలాల్లోని పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారక్క జన జాతరకు సర్వం సిద్ధం

**పల్లెవెలుగు**

సమ్మక్క సారక్క అబ్బియా.. జాలారు బండల్లో అబ్బియా అంటూ సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణాలు బుధవారం నుంచి మారుమోగ నున్నాయి. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య తల్లులు వనం వీడి గద్దెలపైకి రానున్నారు. వారి దీవెనల కోసం పెద్ద ఎత్తున భక్తులు ఎదురు చూస్తున్నారు. భక్తుల ఇలవేల్పు.. భక్తుల కొంగు బంగారం.. కోరిన వరాలు ఇచ్చే ఆ దేవతలను పదిహేను రోజుల నుంచి పూజిస్తున్న భక్తులు వారిని దర్శించుకునేందుకు సంసిద్ధమయ్యారు. వారి అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకున్న భక్తులు రెండోళ్లకోసారి వారిని తలుచుకుంటూ మొక్కులు అప్ప గిస్తారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలోని జాతర ప్రాంగణం జనారణ్యంగా మారనున్నాయి. తెలంగాణ కుంభమేళాగా పేరొందడం మేడారం సమ్మక్క సారలమ్మ, జాతర ఉత్సవాలు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి. మేడారం అనుబంధంగా జిల్లాలో నెల 28వ తేదీన సారలమ్మ గద్దెపై కొలువుదీరనుండడంతో జాతర ఉత్సవాలు.

# అనధికార కట్టడాలకు క్రమబద్ధీకరణ తప్పనిసరి





**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**

కర్నూలు నగరంలో ఉన్న ప్రతి అక్రమ, అనధికార కట్టడాన్ని తప్పనిసరిగా క్రమబద్ధీకరించాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్లానింగ్ కార్యదర్శులతో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బి.పి.ఎస్) పథకాల కింద వచ్చిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు.ప్రతి సచివాలయ పరిధిలో ప్లానింగ్ కార్యదర్శి నేతృత్వంలో అమెనిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులు గుర్తించిన అనధికార లేఅవుట్లు, అక్రమ నిర్మాణాల సంఖ్యకు, వాటికి సంబంధించి వచ్చిన దరఖాస్తులకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్నప్పటికీ సుమారు మూడు వేల అనధికార నిర్మాణాలను గుర్తించగా, కేవలం 425 దరఖాస్తులే రావడం ఏమిటని ప్రశ్నించారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌కు ఏప్రిల్ 23 వరకు, బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్‌కు మార్చి 11 వరకు మాత్రమే దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉందని పేర్కొంటూ, వీటిపై విభాగాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, కింది స్థాయి సిబ్బంది పనితీరును సమీక్షించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రవాణా శాఖ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి






**కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో రవాణా శాఖ 'ఎ' గ్రేడ్ సాధించాలి.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

జిల్లాలో రవాణా శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు కలెక్టర్ రాజకుమారి గణియా, రవాణా శాఖ ప్రజలకు అందించే సేవలపై డిటిసి, ఆర్టిఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... నంద్యాల జిల్లాలో రవాణా శాఖ తరపున ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. గతంలో పాద పద్ధతి ప్రకారం వాహన రిజిస్ట్రేషన్లు ఏజెంట్ల ద్వారా చేయించి వాహనదారుల నుంచి అధిక డబ్బులు వసూలు చేయరాదన్నారు. జిల్లాలో వివిధ వాహనాలకు సంబంధించిన ప్రతి ఒక్కటి ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జరగాలన్నారు. రవాణా శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలపై ఆర్టిజిఎస్ ద్వారా ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. కావున రవాణా శాఖ అధికారులు సిబ్బంది తమ పరిధిలో జరిగే వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయడం, వాహనాలకు ట్యాక్స్ విధించడం, లైసెన్సులు మంజూరు చేయడం,తదితర పనులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాహనదారుల నుంచి చలానా కట్టించాలన్నారు. కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా పనిచేయడం వల్ల జిల్లా పర్ఫార్మెన్స్ తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. రవాణా శాఖ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రవాణా శాఖ పరిధిలో జరిగే పలు అంశాల గురించి ఆర్టీవోలకు కూలం కూషంగా వివరిస్తూ దిశ నిర్దేశం చేశారు.

# అభివృద్ధి పనుల్లో ఇష్టానుసారం చేస్తే చర్యలు

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**








కర్నూలు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఇష్టానుసారం వ్యవహరిస్తే సహించబోమని, జాగ్రత్తలు, నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం వెంకటరమణ ప్రాంతంలో పలు వీధుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. మమతా నగర్‌లోని ఒక అపార్ట్మెంట్ వాసులు మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా డ్రైనేజీ కాలువలు నిర్మించుకున్న అంశంపై ఆరా తీశారు. స్పీడ్ బ్రేకర్లు సమానంగా లేకపోవడం, వాహనాలు సజావుగా వెళ్లే పరిస్థితి లేకపోవడం, రహదారులు నిర్మించిన కొన్ని చోట్ల నేల కుంగిపోవడం, గుంతలు ఏర్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలు, ఇతర అడ్డంకులు ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించకుండా పనులు చేపట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. పదేపదే చెప్పించుకోద్దని నిబంధనలు, జాగ్రత్తలు తీసుకుంటూ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు.

# సంజామల మండలంలో మహిళా సమైక్య సంఘం ఏర్పాటు



**కొలిమిగుండ్ల విలేకరి (పల్లె వెలుగు న్యూస్):-**

సంజామల మండలంలో ఈరోజు నూతన మహిళా సమైక్య సంఘం ఏర్పాటు చేయడం జరిగినది. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగినది. లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళల పైన జరుగుతున్న అన్యాయాలకు, సమాజంలో మహిళల పట్ల చెలరేగుతున్న ఆగడాలను అరికట్టాలంటే మహిళలో చైతన్యం, పట్టుదల స్ఫూర్తి అనేవి మహిళలలో కలగాలి. ఒంటరిగా ఉన్న మహిళలను అదునుగా చేసుకుని అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఆకతాయిల ఆటలు కట్టించాలి అంటే మహిళలు సమిష్టిగా ఉంటేనే మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి అవకాశం ఉంటుందని జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు అబ్రహం ఆధ్వర్యంలో సంజామల, పేరుసోముల లో నూతన మహిళా సమైక్య సంఘాలను ఏర్పాటు చేయడం జరిగినది. సంజామల అధ్యక్షురాలు కే జ్యోతి, కార్యదర్శి పి కవిత, సహాయ కార్యదర్శి సి లక్ష్మీదేవి, సుధా, వేరు స్వాముల గ్రామ శాఖలో అధ్యక్షురాలు ప్రేమ లక్ష్మి, కార్యదర్శి కావేరి, సహాయ కార్యదర్శి సవ్య, కస్తూరి, వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల సిపిఐ కార్యదర్శి బోయ సూర్యనారాయణ, రైతు సంఘం నాయకులు రాజశేఖర్ ఇంకా దద్దరా కమ్యూనిస్టు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు పాఠశాల వార్షిక దినోత్సవ సంబరాలు





**గూడూరు పల్లెవెలుగు జనవరి 27**

మంగళవారం గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ హెచ్ఎం రమేష్ అధ్యక్షతన పాఠశాల వార్షిక దినోత్సవ సంబరాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ పాఠశాల ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సైన్స్ ప్రయోగశాలలను ఉపయోగించుకొని సైంటిస్టులుగా తయారు కావాలని, అలాగే వృత్తి విద్య కోర్సులను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించారు. చదువు పట్ల శ్రద్ధ కలిగి,బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని కోరినారు. అలాగే ఉదయం నిర్వహించిన పాటల పోటీలలో, డ్రాయింగ్ పోటీలలో,డాన్స్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో బృందావనికి చిందులు వేసి అనే పాటకు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు భాస్కర్ 20 మంది విద్యార్థులతో కలిసి చేసిన కొళాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాజశేఖరప్ప, జయలక్ష్మి, జ్యోతి,మంజుల, ఆలీ భాష, ఈరన్న మొదలగు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసముద్రం తహశీల్దార్ ను సన్మానించిన మార్కెట్ చైర్మన్, రేషన్ డీలర్లు.

**కేసముద్రం, జనవరి 27(నంది పత్రిక):**



కేసముద్రం మండల తహశీల్దార్ ను మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గొర్రె వెంకన్నల ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. మండలంలోని ప్రజలకు విధి నిర్వహణలో విశేష సేవలు అందిస్తూ, 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కేసముద్రం తహశీల్దార్ వివేక్ 'ఉత్తమ తహశీల్దార్' అవార్డు అందుకున్నారు. కేసముద్రం లోని తహశీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిటి ఎర్రయ్య, ఆర్ఐ మజీద్, ఆర్టీఏ సభ్యులు రావుల మురళి, రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1
బుధవారం 28-01-2026

## బొలెరో వాహనం బోల్తా.. నలుగురికి గాయాలు

**మహానంది, పల్లె వెలుగు**



బొలెరో వాహనం బోల్తా పడి నలుగురికి గాయాలైన ఘటన మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లి గ్రామంలోని పంచ ముఖ ఆంజనేయ స్వామి గుడి సమీపాన చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లా కి చెందిన 9 మంది యాత్రికులు బొలెరో వాహనంలో మహానందీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనార్థం వచ్చారు. తిరుగు ప్రయాణంలో శ్రీశైలం వెళ్తుండగా పంచ ముఖ ఆంజనేయ స్వామి గుడి సమీపాన స్పీడ్ బ్రేకర్ కనపడకపోవడంతో అదుపుతప్పి బోల్తా పడిందని ప్రయాణికులు తెలిపారు. ఈ ఘటనలో శ్రీకాంత్, రూప, పవిత్ర, ప్రభావతిలకు గాయాలయ్యాయి అన్నారు. వెంటనే అక్కడి స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మహానంది పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## ఏఆర్ అడిషనల్ ఎస్పీ కి విశిష్ట సేవా పతకం

**ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ను శాలువ, పూల మాలతో సన్మానించి అభినందనలు తెలిపిన ఆర్మడు రిజర్వుడు పోలీసు అధికారులు**



**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**



కర్నూలు జిల్లా పోలీసు శాఖకు చెందిన ఏఆర్ అడిషనల్ ఎస్పీ సింగాల కృష్ణమోహన్‌కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక పోలీసు మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం) అవార్డు లభించింది. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పోలీసు అధికారులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. విశిష్ట సేవా పథకం పొందిన సందర్భంగా మంగళవారం ఆర్మడు రిజర్వుడు హెడ్ క్వార్టర్ లో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఎఆర్ డిఎస్పీ ప్రసాద్, ఆర్ ఐలు నారాయణ, జావేద్, పోతలరాజు, ఆర్ ఎస్సైలు కలిసి శాలువ పూలమాలతో సన్మానించారు. కేక్ కట్ చేసి , అభినందనలు తెలియజేశారు. ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ 1992లో పోలీసు శాఖలో ఆర్ ఎస్ ఐ గా చేరారు. 2009 వరదల సమయంలో విశేష సేవలందించారు. పలు సేవాపతకాలు, డీజిపి మెడల్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

## గడివేముల బైపాస్ నిర్మాణ రూట్ మ్యాప్ గురించి పరిశీలన

**నంద్యాల ఆర్డీవో శ్రీనివాసరావు.**

**పల్లె వెలుగు దినపత్రిక గడివేముల**



నంద్యాల జిల్లా గడివేముల మండలంలో బైపాస్ నిర్మాణం చేపట్టాలని గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో ఇరుకు సందులో వాహనాలు పోవుటకు వీలుకాకుండా ట్రాఫిక్ జామడం వలన కావడం వలన చాలా ఇబ్బంది ఎదురుకోవాల్సిన పరిస్థితి వచ్చినది. గతంలో ట్రాఫిక్ భారీ వాహనాలు,అంతరాయం వలన కొంతమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది వీటిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వము గడివేముల బైపాస్ నిర్మాణం చేపట్టాలని ఇచ్చిన జీవోను నంద్యాల ఆర్డీవో శ్రీనివాసరావు కు గడివేముల తాసిల్దార్ వెంకటరమణ రూట్ మ్యాప్ గురించి అడిగి తెలుసుకుని జరిగింది,ఈ పరిశీలనను నివేదికలను తమ ఉన్నతాధికారులకు పంపించి నివేదికలు వచ్చేవరకు ఇలాంటి పరిశీలనను ఉంటాయో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గడివేముల ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షులు దేశం సత్యనారాయణ రెడ్డి, బిలకలగూడూరు మాజీ సర్పంచ్ రఫిక్, మండల అధికారులు పాల్గొన్నారు.

## "అనిశా" చేజిక్కినా ఆగని దందా..!

**మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులు**
**యదేచ్ఛగా లంచాలకు బరితెగింపు**
**ప్రతిపనికి పైసా వసూల్**
**అక్రమాలకు అడ్డాగా నిలచిన ఒంటిమిట్ట మండల రెవెన్యూ కార్యాలయం**
**దుమ్మెత్తి పోస్తున్న విపక్షాలు**

**ఒంటిమిట్ట పల్లె వెలుగు ప్రతినిధి జనవరి 27:**

ఏది శాశ్వతం.. ప్రాణం ఉన్నప్పుడు మనం పెద్దవాళ్ళమని అనుకుంటాం.. కానీ భగవంతుడు పిలిస్తే ఈ పెద్దరికం ఒక్క క్షణంలో అంతమౌతుంది. వైద్యం.. సంపద.. అధికారం.. అనుచరులు.. భవబంధాలు.. ఇవేవీ చివరి క్షణంలో సహాయం చేయలేవు. సంపద ఎంత ఉన్ననూ కనీసం తులసి తీర్థం గొంతులో పోనివ్వని దయనీయ పరిస్థితి. అది కూడా మనం చూడలేం. ఇదంతా గతం మనకు నేర్పిన జ్ఞాపకాలు. అహంకారం, కక్ష, స్వార్థం వదిలేసి మార్గంలో నడవాలి.. ఎదుటివారికి కష్టం కలిగించకుండా జీవించాలి.. చివరికి మనతో ఏదీ రాదు మన మంచితనం మాత్రమే శాశ్వతంగా నిలబడుతుందని మహాత్ములు భావితరాల వారికి ఇచ్చిన సందేశాలు ఏ ఒక్కరూ పాటించకపోవడం దురదృష్టకరం. మరుజన్మ నిజమై ఈ పెద్దరికం, అధికారం, అనుచరులు, భవబంధాలు, సంపద తిరిగి దక్కుతాయా..? కొత్త జన్మలో కొత్త కథ మొదలవుతుందని మన చరిత్ర చెబుతోంది. నేటి సమాజంలో కొందరు ఈ జీవితం మన సొంతం కాదు.. కేవలం ప్రయాణం మాత్రమే అన్న సంగతి మరిచిపోయి స్వార్థ బుద్ధితో అక్రమ మార్గంలో పయనిస్తూ ఎదుటివారికి కష్టం కలిగిస్తూ జీవించేస్తున్నారు. దేవుడి దయవల్ల అదృష్టం కొద్దీ ప్రభుత్వ కొలువు లభించిన కొందరు అధికారులైతే ప్రభుత్వం ఇచ్చిన జీతం చాలదనక తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎదుటివారి బలహీనతను సొమ్ము చేసుకొని లంచావతారమెత్తి అక్రమార్జనే ధ్యేయంగా ఎంచుకొని చిన్నా పెద్ద తేడా లేకుండా దొరికినంత దోచేస్తున్నారు. ఈ క్రమంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల చేతిలో పట్టుబడినా వారిలో మార్పు






ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ కోనరాజుపల్లె వీఆర్వో శ్రీనివాసులు (ఫైల్ ఫోటో)

కనబడడం లేదు. దొరికితే దొంగ లేదంటే రాజు అన్న ధీమాతో లంచం తీసుకోవడం అనేది దినచర్యలో ఒక భాగంగా ఎంచుకొని కొందరు అధికారులు దొంగ బ్రతుకు బ్రతికేస్తున్నారు. ఇటీవల వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం తాసిల్దార్ కార్యాలయంలో కోనరాజుపల్లె విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసులు పొలాలకు విద్యుత్ సర్వీసు తీసుకోవడానికి ఎన్ వో సి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రాజారెడ్డి రమణారెడ్డి అనే రైతుల వద్ద 15,000 రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ సంగతి పాఠకులకు విధితమే. ఇది తెలుసుకున్న మండలంలోని వివిధ శాఖల అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెవెన్యూ కార్యాలయంలోని అధికారులకు మాత్రం ఈ సంగతి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విశేషం. పైగా ఆ కార్యాలయానికి లంచం పిచ్చి బాగా ముదిరిపోయింది. రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల నడుస్తుందన్న సామెతగా మండల రెవెన్యూ కార్యాలయంలో స్థాయికి తగ్గట్టు అధికారులు ప్రతి పనికి ఓ రేటు కుదుర్చుకొని డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు బరితెగించేస్తున్నారు. ఇదేమి అని అడిగేవారు లేకపోవడంతో వారి పని మూడు పువ్వులు ఆరకాయలుగా కొనసాగుతోందని పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారుల దురాఘతానికి వందలాది ఎకరాల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఒంటిమిట్ట మండల రెవెన్యూ కార్యాలయంలో గతంలో పనిచేసిన అధికారులు దొరికినంత దోచుకుని ప్రభుత్వ భూమిని దళారులకు అప్పగించేశారు. రికార్డులను తారుమారు చేశారు. లేనిది ఉన్నట్లు రికార్డులలో ఎక్కించేశారు. ప్రభుత్వభూమిని ఏకంగా అక్రమార్కులకు పిత్రార్జితం, వారసత్వంగా సంక్రమించినట్లు రెవెన్యూ రికార్డులలో చాప కింద నీరులా నమోదుచేసి తమకు ఏమీ తెలియదన్నట్లు తేలుకుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయారు. ఈ విషయాలు గతంలో పత్రికలు ప్రచురితం చేసినా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజాలను మభ్యపెట్టి తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకొని పోవడంతో కిందిస్థాయి అధికారులలో అంతకుమించి లంచం పిచ్చి ముదిరిపోయింది. జనన మరణ ధ్రువపత్రాలు కావాలన్నా, విద్యుత్ సర్వీసులకు ఎన్వోసీ కావాలన్నా, గృహ నిర్మాణానికి అనుబంధ పత్రం కావాలన్నా, తమ పేరిట ఉన్న భూములను ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలన్నా రెవెన్యూ పరంగా ఏ పని కావాలన్నా ఒక్కో పనికి ఒక్కో రేటు పెట్టి ప్రజల వద్ద నుండి వసూలు చేస్తూ ఒంటిమిట్ట మండల రెవెన్యూ అధికారులు అక్రమాలకు బరితెగిస్తున్నారని విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మండల రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అదుపుచేసి ప్రజా పాలన సజావుగా సాగే విధంగా చూడవలసిన అవసరం ఎంతైనా ఉందని విపక్ష నాయకులు కోరుతున్నారు.

## ఘనంగా రుద్రవరం ఆదర్శ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు







**రుద్రవరం.పల్లె వెలుగు :**

రుద్రవరం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ వార్షికోత్సవం కార్యక్రమాన్ని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ సంగెపు నాగేశ్వర రావు అధ్యక్షత వహించగా, స్థానిక తహసీల్దార్ ధోని అల్ఫ్రెడ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ధోని అల్ఫ్రెడ్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. అభివృద్ధి లో దూసుకు పోతూ ఉన్నది అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు, పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత విద్యా సంవత్సరంలో విద్యా, క్రీడలు, సైన్స్ ప్రాజెక్టులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వర రావు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా వారు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అందరం కలిసి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజినీ, నజియ మున్నీసా బేగం, ఈరన్న,పాపయ్య,బషీర్ అహ్మద్,



రఫీ,దివాకర్,నాగరాజు, రాజ్ కుమార్, సుప్రియ, పీ డీ శ్రీనివాసులు, కిరణ్ కుమార్, గౌతమీ, లలిత,నాగేంద్ర, వెంకట రమణ, లక్ష్మి,వీర ప్రకాష్, సిబ్బంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## టీ20 ప్రపంచకప్ నుంచి పాక్ తప్పుకుంటే.. తప్పవీ శిక్షలు!

**పల్లె వెలుగు :**

టీ20 ప్రపంచ కప్ 2026.. పాకిస్తాన్-బంగ్లాదేశ్ నిర్ణయాల వల్ల రోజుకో వివాదం తెరమీదకి వస్తోంది. భద్రతా కారణాలను సాకుగా చూపుతూ భారత్‌లో ప్రపంచ కప్ ఆడబోమంటూ మొండి వైఖరి ప్రదర్శించిన బంగ్లాను ఈ టోర్నీ నుంచే ఐసీసీ తప్పించింది. ప్రత్యామ్నాయంగా స్కాట్లాండ్‌ను ప్రకటించింది. అయితే దీనికి నిరసనగా పాకిస్తాన్ కూడా ఈ టోర్నీకి దూరంగా ఉండాలనే ఆలోచనలోనే ఉంది. ఇప్పటికే జట్టును ప్రకటించినప్పటికీ.. తమ ప్రభుత్వ తుది నిర్ణయాన్ని బట్టే వరల్డ్ కప్ ఆడాలా? వద్దా? అనే దానిపై స్పష్టతనిస్తామని పీసీబీ ఛైర్మన్ నఖ్వి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నఖ్వి.. పాక్ పీఎంతో భేటీ అయ్యాడు.

బుధవారం 28-01-2026

# పల్లె వెలుగు

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499



# విజిబుల్ పోలీసింగ్ తో ప్రజల భద్రతకు భరోసా







**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**
విజిబుల్ పోలీసింగ్ ను బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశించారు.జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. వాహనాల తనిఖీలు. అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. సైబర్ నేరాలపై అవగాహన...ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచిస్తున్నారు. రహదారి భద్రత నిబంధనలు...రహదారి భద్రతపై అవగాహన కల్పించడం , ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై చర్యలు... మైనర్ డ్రైవింగ్ చేయకూడదని, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే స్థానిక పోలీసులకు గాని , డయల్ 112 కు గాని లేదా డయల్ 100 గాని సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.


# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి: కోదండరాం సంచలన వ్యాఖ్యలు

**అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్న ప్రకటన**
**మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమన్న స్పష్టం**
**కాంగ్రెస్‌తో పొత్తుపై ఇంకా నిర్ణయం లేదని వివరణ**
**సింగరేణి పరిరక్షణకు ఉద్యమ స్ఫూర్తి అవసరం**



**పల్లె వెలుగు**
తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల విషయంలో తమ పార్టీ వైఖరిని అధికార పార్టీకి ఇప్పటికే తెలియజేశామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ జన సమితి నిర్ణయించుకున్నదని కోదండరాం వెల్లడించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల అంశంపై కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని చెప్పారు. అయితే తమ పార్టీ మాత్రం ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం ఉద్ఘాటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమని స్పష్టంగా చెప్పారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో భయం లేని వారికి, ఇప్పుడు విచారణ వస్తే ఎందుకు భయం వేస్తోందని ప్రశ్నించారు. అమరవీరుల త్యాగాలతో సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్లపాటు అధికారమిచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని కోదండరాం విమర్శించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప రాష్ట్ర ప్రజలకు లాభం చేకూరలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని కోదండరాం తెలిపారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు ముగింపు పలకడం, ఉద్యమ ఆకాంక్షల సాధనకు ఒక అవకాశం ఇవ్వడం, ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలన్న ఆశయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామని ఆయన వివరించారు.

# 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలి



**పల్లె వెలుగు**
16 వ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ఓటర్ల ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల దినోత్సవాన్ని ఓటర్లలో అవగాహన కల్పించడానికి, ఎన్నికల ప్రక్రియలో సమాచారంతో కూడిన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి జరుపుకుంటామని, భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని మంచి పరిపాలన దక్షత గల నాయకుడిని ఎన్నుకొని ఓటుకు ఉన్న గౌరవాన్ని కాపాడాలని అని అన్నారు. కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే యువత లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జ్యుడీషియల్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని అలాగే చట్టసభలైన పార్లమెంటు, రాజ్యసభ, అసెంబ్లీ, లెజిస్లేటివ్ కౌన్సిల్ వంటిపై కూడా అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పంచాయతీలు జడ్పిటిసి, ఎంపీటీసీ మున్సిపాలిటీ సభ్యుల విధులు అవగాహన చేసువాలని, కొత్త తరం ఆలోచన చేయాలని దేశం యొక్క భవితవ్యం మీ చేతిలో ఉన్నదని, ఏదో పండుగ లాగా ఓటు హక్కు వినియోగించుకో కూడదని అసలు ఓటు ఎందుకు వేస్తున్నామో ఆలోచించాలని వెల్లడించారు. ఓటు హక్కు ఉన్న ప్రతివారు రాబోయే తరాలకు ఓటు విలువ తెలియజేయాలని ప్రతిజ్ఞ చేయించారు.భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేసున్నాము అన్నారు. అదనపు కలెక్టర్ కె సీతా రామారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు ముఖ్యమైనదని, బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తివంతమైనదని అలాంటి ఓటును స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకూడదని అన్నారు. అంతకుముందు సూర్యాపేట ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, జిల్లా అధికారులు, సిబ్బంది స్కూల్, కాలేజీ విద్యార్థులు, ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ క్యాడట్లు మందడి ఏవిన్యూ నుండి ఓటు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ర్యాలిగా బయలుదేరి కలెక్టరేట్ చేరుకున్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ ఫారం -6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు కోసం కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు ప్రశంస పత్రాలు, షిల్డ్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, డీఈఓ అశోక్, సామాజిక పర్యావరణవేత్త దుచర్ల సత్యనారాయణ, తాసిల్దార్లు, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల, కాలేజీ విద్యార్థులు,ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ క్యాడట్లు తదితరులు పాల్గొన్నారు.

# నక్ష శిక్షణకు గుజరాత్‌కు కమిషనర్



**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**
కేంద్ర ప్రభుత్వానికి చెందిన భూసంపత్తుల శాఖ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో నిర్వహించనున్న నక్షా శిక్షణ సదస్సులో పాల్గొనేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ గుజరాత్‌కు వెళ్లనున్నారు. ఈ నెల 29, 30వ తేదీల్లో గాంధీనగర్‌లోని దీన్ దయాల్ సర్వే మరియు ఆదాయ పరిపాలనా సంస్థలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా నక్షా కార్యక్రమ అమలు విధానం, వైమానిక సమాచారం సేకరణ, పటాల ఆధారిత ఫలితాలు, క్షేత్రస్థాయి ధృవీకరణ విధానాలు, వెబ్ ఆధారిత భౌగోళిక సమాచార వ్యవస్థ వినియోగం, అలాగే పట్టణ స్థాయిల్లో చేపట్టాల్సిన బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. ఈ శిక్షణ ద్వారా భూసంబంధిత ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో మరింత స్పష్టత, సమర్థత సాధించేందుకు దోహద పడుతుంది.

# వేదాంత భజన మందిరం వద్ద రథ సప్తమి వేడుకలు



వాహనంపై ఊరేగిన శ్రీ రాముడు

**పల్లె వెలుగు**
రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజారు వద్ద గల వేదాంత బజన మందిరం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ధరూరి సింగరాచార్యులు సూర్య భగవానుని కి నైవేద్యం సమర్పించి అనంతరం భక్తులకు నైవేద్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య పారాయణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు చదివి వినిపించారు.... అనంతరం పూలతో అలంకరణ చేసిన సూర్యప్రభ వాహనంపై శ్రీరామచంద్రున్ని కోలాట బృందాలతో వేడుకగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు... ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, శీలా శంకర్, సోమా సుమన్, చిత్తలూరి శ్రీధర్ , ఆలయ అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధునిక సౌకర్యాలతో స్పర్శ పిల్లల హాస్పిటల్ ప్రారంభం

**ప్రారంభించిన డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్**



**పల్లె వెలుగు**
కేంద్రంలో నిర్మల హాస్పిటల్ రోడ్ లో ఆదునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన స్పర్శ పిల్లల హాస్పిటల్ ను బుధవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట మెడికల్ హబ్ గా మారుతుందని అన్నారు. సూర్యాపేట లో గత పది సంవత్సరాల కాలంలో దాదాపుగా 200 ప్రైవేట్ హాస్పటల్ ప్రారంభమయ్యాయని, సూర్యాపేటలో కార్డియాలజీ న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజి, నెప్రాలజి వంటి వైద్య సేవలు లభిస్తున్నాయని, మోకాళ్ళ చిప్పలు మార్చే వైద్యం సూర్యాపేట వైద్యులు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో సూర్యాపేటలో బైపాస్ సర్జరీ కూడా లభిస్తుందని అన్నారు. .సూర్యాపేటలో స్థానికుడైన తిరునగరు భరత్ ఎంబిబిఎస్ ఎండి పూర్తి చేసి స్థానిక ప్రజలకు తక్కువ ధరలో వైద్యం అందించడం కోసం స్పర్శ పిల్లల హాస్పిటల్ ను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. చిన్న పిల్లల వైద్యం కోసం చాలామంది హైదరాబాదు కు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, స్పర్శ హాస్పిటల్ లో తక్కువ ధరలో నాణ్యతగల వైద్యాన్ని పేదలకు అందించి ప్రముఖ హాస్పిటల్ గా పేరు సంపాదించుకోవాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ చైర్మన్ డాక్టర్ ఆనంద్ దాంగ్డె, నిర్వాహకులు డాక్టర్ తిరునగరు భరత్, తిరునగరు శ్రీనివాస్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

బుధవారం 28-01-2026


## ముల్కలపల్లిలో ఎగిరిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా

-పార్టీ ఆవిర్భావ లక్ష్యాలను వివరించిన తీన్మార్ మల్లన్న
-బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అధికారమే ధ్యేయం

పల్లె వెలుగు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం ముల్కలపల్లి గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన తీన్మార్ మల్లన్న, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందో, ఈ పార్టీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటో వివరించారు. 78 ఏండ్లుగా కొనసాగుతున్న రెడ్డి, వెలమల ఆధిపత్య రాజకీయాలను అంతం చేసి, జనాభాలో 90 శాతం ఉన్న వర్గాలకు అధికారాన్ని అందించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ప్రభావం నుంచి బయటికి వచ్చి, తమ కోసం పుట్టిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎత్తాలని ఆయన పిలుపునిచ్చారు. “మన రాజ్యం మనమే సాధించుకుందాం” అంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలబోయన ఓదేలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు బీకు నాయక్, కొమ్మిశెట్టి నర్సింహులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్తో పాటు ముల్కలపల్లి టీఆర్పీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు శిక్షణ తరగతులు ద్వారా నైపుణ్యం పెంపొందించుకోవాలి

-విద్యార్థులకు సాంకేతికతతో కూడిన విద్యను అందించాలి

పల్లె వెలుగు




జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల ద్వారా నూతన సాంకేతికత నైపుణ్యం పెంపొందించుకొని విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్ ఐ ఈ పి ఏ వారు నిర్వహిస్తున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఎంపవరింగ్ కేజీబీవీ వార్డెన్స్ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం వలన ఉపాధ్యాయులలో నూతన సాంకేతికత పెంపొందించుకొని విద్యార్థులకు సాంకేతిక విద్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా విద్య నేర్పించడం జరుగుతుందని, కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటుందని, దీనికి కారణం ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించటం విద్యార్థులకు కూడ భోజనం వసతి కల్పించి ఎక్కువ సమయం ఉపాధ్యాయులతో మమేకం కావడం వలన ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉన్నదని, మీరు తీసుకున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్ మరల స్కూల్ కి వెళ్ళిన తర్వాత మీ తోటి ఉపాధ్యాయులకు కూడ అందించాలని, రెసిడెన్షియల్ స్కూల్స్ ఇంకా పోటీపడి కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా ఉండాలని విద్యార్థులకు సైన్స్, మాథ్స్ సబ్జెక్టులలో బోధన సామర్థ్యం ఇంకా పెంచాలని రెసిడెన్ స్కూల్లో చదివే ఎక్కువ శాతం మంది పిల్లలు గ్రామీణ ప్రాంతాల నుండి వేద విద్యార్థులే వస్తారు కాబట్టి వారికి ఉన్నతమైన చదువు అందించి గ్రూప్స్, మెయిన్స్, సివిల్స్ పరీక్షలకు పోటీపడే విధంగా తయారు చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ ఓ అశోక్, నోడల్ ఆఫీసర్ జి ఈ సి ఓ పూలన్, మాస్టర్ ట్రైనర్స్ నిర్మల జ్యోతి, తవిటి నాయుడు, సూర్య కళ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

-శానిటేషన్పై ప్రత్యేక దృష్టి క్లీన్ అండ్ గ్రీన్ సిటీ లక్ష్యం
-పెండింగ్ వర్క్స్, హెచ్సిటీ ఎస్ఆర్డీపీ ప్రాజెక్టుల పురోగతి పరిశీలన
-మంత్రి పొన్నం ప్రభాకర్




పల్లె వెలుగు

హైదరాబాద్ నగర అభివృద్ధి, శానిటేషన్ మెరుగుదల లక్ష్యంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులు, హెచ్సిటీ, ఎస్ఆర్డీపీ ప్రాజెక్టుల వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో పాటు అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. శానిటేషన్ అంశంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికల్లో భాగంగా పలువురు ఇంజనీరింగ్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించాలని, వారి కార్యచరణపై నిరంతర సమీక్ష జరపాలని సూచించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, డ్రెయినేజ్ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా టైమ్లైన్లతో ముందుకు వెళ్లాలని, పెండింగ్ వర్క్సను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశిస్తూ, ప్రాజెక్టుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

## ధర్మపురిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

-యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్కు శంకుస్థాపన
-విద్య, సంక్షేమమే తెలంగాణ భవిష్యత్తు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

పల్లె వెలుగు



జగిత్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్య, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్కు భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, వసతులు కల్పించే లక్ష్యంతో ఒక్కో స్కూల్ను సుమారు 25 ఎకరాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలి ఏడాదిలోనే 100 స్కూల్లకు అనుమతులు ఇచ్చామని, మొత్తం రూ. 22,500 కోట్లతో ప్రణాళికలు రూపొందించి మొదటి దశలో రూ. 11,500 కోట్ల విలువైన పనులకు శాంక్షన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మన బిడ్డల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు అని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి నెల బిల్లులు మంజూరు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇండ్లకు అనుమతులు ఇచ్చామని, మహిళలను మహాలక్ష్మిలా గౌరవిస్తూ ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ నేతల కీలక సమావేశం

-మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం
-పార్టీ సమన్వయం, ప్రభుత్వ పథకాల ప్రచారంపై చర్చ

పల్లె వెలుగు



కరీంనగర్ ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నేతలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, హుస్నాబాద్, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. నేతల మధ్య సమన్వయం పెంపొందించడం, ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రజల్లోకి తీసుకెళ్లడం, కేడర్ను చురుగ్గా పనిచేయించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు సమిష్టిగా పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కరీంనగర్, సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు సత్తు మల్లేష్, లింగమూర్తి, నాగుల సత్యనారాయణ గౌడ్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్, సంగీతం శ్రీనాథ్, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఇక కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు, హుజురాబాద్ ఇన్చార్జి ఒడితల ప్రణవ్, సిరిసిల్ల ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్సై సాయిరాం. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై సాయిరాం వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలన్నదే పోలీసుల ప్రధాన ఆశయమని ఆయన పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం మరియు మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రాణాలతో చెలగాటమని హెచ్చరించారు. ముఖ్యంగా వాహనాలపై ప్రమాదకరంగా నిలబడి ప్రయాణం చేయడం సరికాదన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించాలని పలు సూచనలు చేశారు.

## వేసవి పనులకు కసరత్తు పూడుకుపోయిన పంట కాల్వ

పల్లె వెలుగు

ప్రతిపాదనలు పంపాలని కోరిన కడాసిద్ధం చేస్తున్న జల వనరుల శాఖ అధికారులురూ. 70 కోట్ల విలువైన పనులకు అవకాశం వేసవిలో పంట కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళనకు ప్రతిపాదనలు సిద్ధమవు తున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమాండ్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడా) కమిషనర్ ఈసారి ప్రతిపాదనలు పంపాలని దిశా నిర్దేశించారు. ఆ మేరకు పశ్చిమ డెల్టా పరిధిలో పనులను గుర్తిస్తున్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపేందుకు కసరత్తు చేస్తున్నారు. నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు నిర్వహించ నున్నారు. ఈ ఏడాది పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయించేలా ప్రతి పాదనలు పంపాలని అధికారులు నిర్ణయించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులను చేప ట్టాలని యోచిస్తున్నారు. దీనివల్ల అధిక వర్షాలు కురిసినప్పుడు పంట పొలాలు ముంపు సమస్యను అధిగమించనున్నాయి. గడచిన కొన్నేళ్లనుంచి పూడిక తీయక పోవడంతో డ్రెయిన్లలో నీటి ప్రవాహవేగం తగ్గింది. ఫలితంగా కొద్దిపాటి వర్షాలు కురిసినా పశ్చిమ డెల్టాలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. ఉండిలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దాతలను సమీకరించి డ్రెయిన్ల తవ్వకాలు చేపట్టారు. పంటకాలువ ప్రక్షాళన చేపట్టి శివారు ప్రాంతాలకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. మరోవైపు పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో కొద్దో గొప్పో పనులు జరిగాయి. అంతే తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో పెద్దగా పనులు చేపట్టలేకపోయారు. గతేడాది కొద్దిపాటి నిధులను విడుదల చేశారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
GST No.37ACDFM5465G1Z1
RNI-APTEL/2012/46499



# రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణ సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి: ఎస్పీ నరసింహ

**-వాహనాలపై నిలబడి ప్రయాణం చేయడం ప్రమాదం.**

**-సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలి.**

పల్లె వెలుగు

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించి గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలి, పిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేసుకోవాలి, రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలి, కేసులు పెండింగ్ లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలి, కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలి, పోక్సో కేసుల్లో, మహిళా సంభంద కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పని చేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలి. పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా పని చేయాలి, పోలీసు వేగవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పని చేయాలని ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ వాహన దారులను ప్రజలను రోడ్డు భద్రత పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించాలి అని తెలిపినారు. రోడ్డు భద్రత పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ముందుకెళ్లాలి అని అధికారులకు సూచనలు చేశారు.




ప్రయాణ సమయంలో ప్రజలు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు. వాహనాలపై నిలబడి ప్రయాణం, ఎక్కువ మంది ప్రయాణం చేయడం ప్రమాదమని గుర్తు చేశారు. తప్పుడు మార్గంలో ప్రయాణం చేయొద్దు, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు అసాంఘిక కార్యకలాపాలకు అక్రమ రవాణాలకు పాల్పడితే అలాంటి వారిని ఉపేక్షించమని హెచ్చరించారు. ఈ సమావేశం నందు జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, డిసిఆర్బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరిబాబు, ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, రాజశేఖర్, వెంకటయ్య, లు, ఐటి కోర్ సిబ్బంది, డిసిఆర్బి సిబ్బంది ఉన్నారు.

# రానున్న మూడేళ్లలో నేరేడుచర్ల మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తా

**పేదల జీవితాలలో వెలుగు నింపడమే తన ధ్యేయం**

పల్లె వెలుగు

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి. మహిళల జీవితాలలో ప్రత్యేకించి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అందులో భాగంగానే వడ్డీ లేని రుణాల పంపిణీ ఇస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.మంగళవారం అయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ ఆవరణలో నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని 404 స్వయం సహాయక మహిళా సంఘాలకు 52, 07,399 రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అంతేకాక ఇందిరా మహిళా శక్తి పథకం కింద 5498 మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తాను ప్రజా జీవితంలో తపస్సులా ముందుకెళు న్నానని పేదల జీవితాలు బాగుపడేలా చేయడమే తన ధ్యేయమని అన్నారు.



నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో వడ్డీ లేని రుణాల పంపిణీ తో పాటు 5498 మందికి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.మిర్యాలగూడ నుండి నేరేడుచర్ల, కోదాడ మీదుగా ఖమ్మం జాతీయ రహదారి వరకు రహదారిని వేయించింది గతంలో తానేనని గుర్తు చేశారు . ఉన్నత విద్యను అభ్యసించేందుకు హుజూర్నగర్ లో 7.50 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాలను, 4.50 కోట్ల రూపాయలతో డిగ్రీ కళాశాల భవనాలు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని,హుజూర్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 2.5 కోట్లతో సిటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకుగాను హుజూర్నగర్ లో మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తే 40 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకొని 4500 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.ప్రజా ప్రభుత్వం రాకముందు గత ప్రభుత్వం పేద ప్రజలకు దొడ్డు బియ్యాన్ని ఇచ్చేదని అలాంటిది మేము అధికారంలోకి వచ్చాక సన్న బియ్యం ఇస్తున్నామని అంతేకాక అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాల పెద్ద భరోసా అని అన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వమే చెల్లించి వారికి పెద్ద ఎత్తున తోడ్పాటు అందిస్తున్నదన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో 52,07,399 రూపాయల వడ్డీ లేని రుణంతోపాటు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఆర్పీ లు, మున్సిపల్ సిబ్బంది ఇందిరమ్మ చీరలను జాగ్రత్తగా అర్హులైన ప్రతి ఒక్కరికి బాధ్యతగా పంపిణీ చేసి ప్రతి చీరకు రసీదు తీసుకోవాలని ఆయన సూచించారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ కే నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి,ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి,మెప్మా సిబ్బంది,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సేంద్రియ సాగు వైపు రైతులు మళ్లాలి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**-నేలకొండపల్లిలో రైతులకు అవగాహన సదస్సు**

**-రసాయనాల వల్ల నేల, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

**-భూమి పవిత్రత కాపాడాల్సిన బాధ్యత అందరిదే**

పల్లె వెలుగు



నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగ విద్యాలయంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుల మందుల అధిక వినియోగం వల్ల నేల క్రమంగా విషతుల్యంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం నేరుగా ప్రజల ఆరోగ్యంపై పడుతోందని పేర్కొన్నారు. గతంలో ఉన్నట్లుగానే ప్రతి రైతు మళ్లీ సేంద్రియ సాగు వైపు మళ్లాలని నారాయణ పిలుపునిచ్చారు. దేశంలో అత్యంత సారవంతమైన భూములు ఉన్నప్పటికీ, సరైన ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. విత్తనాలు, ఎరువుల వ్యాపారం పూర్తిగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడంతో లాభాలు రైతులకు కాకుండా బడా సంస్థలకే చేరుతున్నాయని ఆరోపించారు. చివరి ఊపిరి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ సదస్సులో త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి కూడా పాల్గొని ప్రసంగించారు. భూమి పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, మనిషి అత్యాశ వల్ల ప్రకృతి సమూల నాశనానికి గురవుతోందని హెచ్చరించారు. హైబ్రిడ్ సాగు విధానాలు, పశుపోషణలో జరుగుతున్న మార్పుల వల్ల రోగాలు పెరుగుతున్నాయని, నేటి ఆహారం ఎక్కువగా కలుషితమైందని తెలిపారు.

# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన :రాంరెడ్డి సర్వోత్తమ్ కొప్పుల వేణారెడ్డి



పల్లె వెలుగు

సీఎం సహాయ నిధి పేదలకు భరోసా అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రెడ్ హౌస్ లో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. వందలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి కి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, ఛివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్ గౌడ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వేములకొండ పద్మ, గుణగంటి వంశీధర్, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిఎం. వి సునీత ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీసీ సిబ్బంది



పల్లె వెలుగు


ఇటీవల సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన వి సునితని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో ఆర్టీసీ సూపర్వైజర్ల సమక్షంలో సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట డిపో మేనేజర్ సునీత మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ సిబ్బంది ముందు వరుసలో ఉన్నా రాని వివరించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ ప్రజలకు మరింత చేరువైందని తెలిపారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టిసి బస్సులు భరోసా కల్పించేలా సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాన్నారు. అంకితభావంతో పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ బి. సైదులు, సూపర్వైజర్లు జి. రమశ్రీ , కే ధనమ్మ, బి రామయ్య, మాచర్ల భాస్కర్, ఆర్టీసీ సిబ్బంది ప్రతినిధులు సుంకరి శ్రీనివాస్, సుధాకర్ గౌడ్, ఎండి అబ్దుల్ ఘని,పాదూరి రమేష్,విజయ ఆనంద్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


పల్లె వెలుగు
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1
బుధవారం 28-01-2026

## సంపాదకీయం

# వెనక్కి నడుస్తోన్న కాలచక్రం!






భవిష్యత్తును నూటికినూరుపాళ్లూ ఊహించటం కష్టం! నాయకుల ప్రవర్తనలు, రాజకీయ పరిణామాల విషయంలో అది మరింత నిజం! సమకాలీన పరిస్థితులను ఎంతో సునిశిత పరిశీలనాశక్తితో చూసేవారు కూడా భవిష్యత్తు పరిణామాల్లో కొన్నిటినే అంచనావేయగలరు. జరిగిన చరిత్రను లోతుగా మథించి, జరుగుతోన్న చరిత్రనూ సమగ్రంగా అవగాహన చేసుకుంటున్నప్పటికీ భవిష్యద్దర్శనానికి ఎన్నో పరిమితులు ఉంటాయి. అనుకోని సంఘటనలు, అనూహ్య పరిణామాలు అంచనాలను తారుమారు చేస్తాయి. కానీ కొన్ని పరిస్థితులు కొంతకాలం ఒకే ఒరవడిలో బలంగా కొనసాగుతూ ఉంటే భవిష్యత్తు రూపురేఖలు కాస్త స్పష్టంగానైనా తెలుస్తాయి. ప్రొఫెసర్ చాల్మర్స్ జాన్సన్ 19 ఏళ్లక్రితం 'నెమిసిస్' (కర్మఫలం) అనే పేరుతో ప్రచురించిన పుస్తకంలో చేసిన విశ్లేషణే ఇందుకు నిదర్శనం. 1945 తర్వాత అమెరికా తన ఆధిపత్య విస్తరణ కోసం చేసిన అనేక అమానవీయ, అప్రజాస్వామ్య నిర్వాకాలకు కర్మఫలితాలను అనుభవిస్తోందనీ, ఒక్కొక్కటిగా అవన్నీ కళ్లముందు రూపుకడుతున్నాయనీ జాన్సన్ విశ్లేషించారు. ఆయన అంతటితో ఆగలేదు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి చివరిరోజులు సమీపిస్తున్నాయని భవిష్యద్దర్శనంలాగా అంచనా వేశారు. ఆయన చేసిన పదునైన సూత్రీకరణలనూ, వ్యాఖ్యలను చూస్తే అవి ఎంతగా ఇప్పటి పరిస్థితులకు సరిపోతాయో స్పష్టంగా తెలుస్తుంది. 'నెమిసిస్' (2007) రాసే నాటికి డోనాల్డ్ ట్రంప్ రాజకీయాల్లో ఒక శక్తిగా మారతారనీ సమీప భవిష్యత్తులో అమెరికా అధ్యక్షుడు అవుతారనీ ఎవరూ భావించలేదు. విచిత్రం ఏమిటంటే 'నెమిసిస్'లో వేసిన అంచనాలన్నిటినీ శక్తివంచన లేకుండా ట్రంప్ నిజసాక్షాత్కారం చేస్తున్నారు. "ఒక దేశం ప్రజాస్వామ్యంగానో, సామ్రాజ్యంగానో ఉండగలదు. ఏకకాలంలో రెండుగా ఉండలేదు"."రిపబ్లిక్ వ్యవస్థ ఒకసారి సామ్రాజ్యంగా మారితే.. తిరిగి పూర్వస్థితికి చేరుకోలేని రీతిలో దాని పతనం మొదలవుతుంది"."అధ్యక్షపదవి అనేది రాజ్యాంగబద్ధంగా ఉండటం కాకుండా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని స్థాపించే సంస్థగా మారిపోతుంది"."సామ్రాజ్య ఆధిపత్యం కోసం చేసే ఖర్చులు కేవలం ఆర్థికపరమైనవే కావు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం నాశనం కూడా వాటిల్లో భాగమే"."సామ్రాజ్యాలు తప్పనిసరిగా ప్రతిఘటనను సృష్టిస్తాయి"."చరిత్ర చెబుతున్న నిజం ఏమిటంటే ఏ సామ్రాజ్యమైనా తన ప్రజల స్వేచ్ఛను నాశనం చేయకుండా ఎక్కువకాలం ఉండలేదు". నెమిసిస్‌లో చేసిన ఈ సూత్రీకరణల్లో ఇప్పటి పరిస్థితులకు పూర్తిగా పొసగనిది ఒక్కటి కూడా లేదని చెప్పలేం. తీవ్రతలో తేడా ఉండొచ్చు. అన్నీ ఏదోవిధంగా కళ్లముందు కదులుతూనే ఉన్నాయి. సుంకాలపేరుతో దేశాలన్నిటినీ ఠారెత్తించటానికి తాను తీసుకుంటున్న చర్యలకూ నిర్ణయాలకూ ఆమోదముద్ర వేయకపోతే పరిణామాలు తీవ్రంగానే ఉంటాయని సుప్రీంకోర్టును ఉద్దేశించి పరోక్షంగా, ప్రత్యక్షంగా ట్రంప్ చేస్తున్న హెచ్చరికలు చూస్తుంటే న్యాయవ్యవస్థ ఎంత ఒత్తిడులకు గురవుతోందో అర్థమవుతోంది. అలాగే చట్టసభల్లో చర్చల్లేకుండా, ఆమోదం లేకుండా డిక్రీలెన్నో జారీ అవుతున్నాయి. విదేశాంగ విధానాలను విమర్శించే వారందరిపై నిఘాలు తీవ్రమయ్యాయి. విశ్వవిద్యాలయాల్లో భావప్రకటనా స్వేచ్ఛపై కట్టడులు పెరిగిపోతున్నాయి. గాజా నరమేధాన్ని విమర్శించే వారందరినీ యూదు వ్యతిరేకులుగా ముద్రవేసి వేధించటమూ ఇంకా ముగియలేదు. ప్రసారమాధ్యమాలపై ఎదురుదాడులూ సాధారణమయ్యాయి. బయటదేశాలపై చూపిస్తున్న సామ్రాజ్యవాద పోకడలతో అంతర్గతంగా ప్రజాస్వామ్యం బలహీనమవుతున్న పరిణామాలకు ఇవన్నీ నిదర్శనాలు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌మాగా) మార్చటానికంటూ చేపడుతున్న ప్రతిచర్యా సామ్రాజ్యవాద ధోరణులకు పెద్దపీట వేస్తుంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నోరెత్తలేని స్థాయికి చేరుకుంటున్నాయి. అంతర్జాతీయ ఒప్పందాల నుంచీ, సంస్థల నుంచీ వైదొలగటమే కాకుండా అవన్నీ అమెరికా ప్రయోజనాలకు అడ్డంకిగా మారాయని పదేపదే విమర్శలు చేయటంతో ప్రపంచమే ఇటీవలకాలంలో ఎరగని రాజకీయ సంక్షోభంలోకి జారుకుంటోంది. 'మాగా' అనేది అసలుసిసలైన జాతీయవాదమనీ దేశ వ్యతిరేకులుగా ముద్రవేయవచ్చు. మతాల్లోని చెడులను విమర్శించే వారిని దేశ సంస్కృతికి ద్రోహంచేసే మహాపాపులుగా చిత్రీకరించవచ్చు. జాతి ఆధిక్యత కోసం విదేశీ భూభాగాలపై అనుచితంగా హక్కులనూ కోరొచ్చు.కోసం గ్రీన్‌ల్యాండ్‌ను కట్టబెట్టాలన్న దాన్ని సహజ కోరికగానూ భావించొచ్చు. అక్కడి ప్రజల ఇష్టాయిష్టాలతో పనిలేదు. మీరు డబ్బులకు అమ్ముడు పొండి.. సార్వభౌమత్వాన్ని వదులుకోవాల్సిందే. జాతిగొప్ప భావనలతో ఊగిపోయే నేతలకు పర్యావరణం పట్టదు. ఆర్కిటిక్ మంచు మహాఫలకాలు కరిగిపోయి, జలప్రవాహాలు ఏర్పడి, కొత్త సముద్రమార్గాలు ఏర్పడుతుంటే ప్రాకృతిక విపత్తులుగా అవి అనిపించవు. ఖనిజాలు (2534 రకాల విలువైనవి), చమురు అన్వేషణలకు భారీ అవకాశాలుగానే అవి కనపడతాయి. పర్యావరణ బీభత్సాన్ని ఎదుర్కోవాలన్న తపన ఏ కోశానా ఉండదు. మానవాళికి కలిగే సమష్టిముప్పు గురించి గ్రహింపు ఉండనే ఉండదు.

# శునకాలపై ప్రేమ.. మరి మనుషులపై?

పల్లె వెలుగు



జీవకారుణ్యం భారతీయ సంస్కృతికి కొత్త విషయం కాదు. ఓ దేవతకు మేకను బలి ఇవ్వబోతున్న కొందరిని చూసి.. దానిని వదిలేయాలని, అంతగా అయితే తనను బలి తీసుకోవచ్చని గౌతమ బుద్ధుడు దాదాపు 2,600 ఏళ్ల కిందటే చెప్పిన చరిత్ర మనది. తనను వేటాడుతున్న డేగ నుంచి కాపాడమని ఓ పావురం శిబి చక్రవర్తిని ఆశ్రయిస్తే.. ఆ పావురానికి సమానమైన బరువున్న మాంసాన్ని తన తొడ నుంచి కోసి డేగకు ఇచ్చిన శిబి చక్రవర్తి కథ మన పురాణాల్లో ఉంది. అరణ్యాలను రక్షించుకోవటానికి 1970ల నాటి చిప్కో ఉద్యమకారులు చెట్లను ఆలింగనం చేసుకొని.. వాటిని కూల్చే ముందు తమను నరికివేయాలని సవాల్ విసిరారు. కానీ, నేడు జంతు ప్రేమికులు, ముఖ్యంగా కొందరు కుక్కల ప్రేమికుల ధోరణి చూస్తుంటే.. తమ ప్రాణాలు అడ్డుపెట్టటం అటుంచి.. సాటి మనుష్యుల ప్రాణాలు పోయినా ఫర్వాలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వారి వాదనలు, మాటలు వింటుంటే అలాంటి అభిప్రాయమే కలుగుతోంది. వీధి కుక్కల దాడుల్లో అత్యంత దారుణంగా చిన్న పిల్లలు గాయపడుతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు. పెద్దలూ కుక్కల దాడికి గురవుతున్నారు. వీధుల్లో రాత్రి పూట సంగతి దేవుడెరుగు.. పగటి పూట నడిచి వెళ్లాలన్నా కుక్కల మందలను చూసి జంకే పరిస్థితి నెలకొంది. నైట్‌షిఫ్ట్ ఉండే మీడియా, ఐటీ, డెలివరీ వంటి ఉద్యోగులైతే.. ఏ అర్ధరాత్రో ఇంటికి వెళ్తున్నప్పుడు కుక్కల భయానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. గత ఐదేళ్లలో ఒక్క తెలంగాణలోనే కుక్క కాటు బాధితులు 14,88,781 అని రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపింది. తెలంగాణలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పలు గ్రామాల్లోని ప్రజలు.. కుక్కల బెడదను తప్పించాలని అభ్యర్థులను కోరారు. ఏపీలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. వీధి కుక్కల సమస్య ఓ సామాజిక సమస్యగా మారింది. దీనికి బలవుతున్న వారిలో అత్యధికులు నిరుపేదలు, దిగువ మధ్యతరగతివారు. ఇంటి చుట్టూ ప్రహరీ కట్టుకోలేని గుడిసె వాసి తన పిల్లల్ని కుక్కల బారి నుంచి ఎలా కాపాడుకోగలడు? ఈ సమస్యపై ఇన్నాళ్లకు సుప్రీంకోర్టు దృష్టి పెట్టి.. బడులు, ఆస్పత్రులు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి పబ్లిక్ ప్లేసుల్లో వీధి కుక్కలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను ఆదేశిస్తే.. దానికి వ్యతిరేకంగా బోలెడు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇటీవల విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు జడ్జిల్లో ఒకరు.. వీధి కుక్కల గురించి వాదించే లాయర్లు కోర్టు హాల్లో ఇంతమంది ఉన్నారుగానీ.. మనుష్యుల ప్రాణాల గురించి వాదించేవారు మాత్రం కనిపించటం లేదని ఆశ్చర్యపోయారు. విచిత్రమేమిటంటే, కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న వాళ్లు, గాయపడుతున్నవాళ్లు ప్రభుత్వాలకు పన్ను కడుతున్న ప్రజల్లో ఓ భాగం. అంటే ప్రభుత్వాల్ని, ప్రభుత్వ పథకాల్ని వారు పోషిస్తున్నారు. ఓటు వేసి ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నారు. కానీ, వారి ప్రాణాలకు కుక్కల దాడుల నుంచి ఎటువంటి హామీ లేదు. ఏ పన్నూ కట్టని వీధి కుక్కల ప్రాణాలకు మాత్రం జంతు సంరక్షణ చట్టాలున్నాయి. కుక్కను కొడితే కేసు, ప్రాణం తీస్తే కేసు, జైలుశిక్ష. కుక్కలపై దాడి చేసిన వ్యక్తిని చట్టాల ప్రకారం శిక్షిస్తున్నారు. మరి, వీధి కుక్క దాడి చేసి ఓ చిన్న పిల్లాడిని చంపినప్పుడో, అనేక మందిని కరిచినప్పుడో ఎవరినీ శిక్షించటం లేదేం? కుక్కల నుంచి మనుష్యులను రక్షించే చట్టాలు ఉండొద్దా? కుక్క దాడి చేసినప్పుడు శిక్ష ఎవరికి విధించాలి? ఆ కుక్కకా? కుక్కల ప్రేమికులకా? వీధి కుక్కల దాడిలో గాయపడినవారికి ప్రభుత్వాలు, జంతుప్రేమికులు పరిహారం ఇవ్వాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'వీధి కుక్కల మీద అంత ప్రేమ ఉంటే ఇళ్లలోకి తీసుకెళ్లి పెంచుకోండి' అని సూచించింది. కుక్కల ప్రేమికులు ఈ బాధ్యత ఎందుకు తీసుకోరు? కుక్కలపై వారి ప్రేమ కోసం అమాయక చిన్నారులు, జనం తమ ప్రాణాలతో మూల్యం చెల్లించాలా? వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించి, ఎక్కడి నుంచైతే వాటిని తీసుకెళ్లారో అదే ప్రాంతంలో తిరిగి విడిచిపెట్టాలని కుక్కల ప్రేమికులు చెబుతుంటారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం కూడా ఇదే. దీంట్లో ఉన్న సమస్య ఏమిటో చూద్దాం. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో జనాభా నియంత్రణ కోసం సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించుకోవాలని ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. ఆ ప్రచారం ప్రజలను చేరి, ఫలితాలు రావటానికి దశాబ్దాలు పట్టింది. అది కూడా దక్షిణాది రాష్ట్రాల్లోలాగా ఉత్తరాదిన సమర్థవంతంగా అమలు కాలేదు. మనుష్యుల్లోనే ఈ పరిస్థితి ఉంటే కుక్కల్లో సంతాన నిరోధక ఆపరేషన్లు పూర్తిగా అమలయ్యేది ఎప్పుడు? ఒకవేళ అమలైనా.. ఒక్కో కుక్క జీవితకాలం సగటున పదేళ్లు అనుకుంటే.. ఈ పదేళ్లపాటు అది అప్పుడప్పుడు కరిచినా, చిన్నారుల్ని చంపినా భరించాల్సిందేనా? కుక్కల ప్రేమికుల వాదన ప్రకారం.. వాటికీ జీవించే హక్కు ఉంది. నిజమే! మరి, మనుష్యులకూ ఉంది కదా. కుక్కల ప్రేమికుల మరో వాదన.. 'డెంగ్యూ వంటి దోమకాటు వ్యాధుల్లో, రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది జనం మరణిస్తున్నారు.. వాటి మీద మాట్లాడకుండా వీధి కుక్కల మీదే ఎందుకు ఫోకస్ చేస్తున్నారు?' అన్నది. దీనికి సమాధానం ప్రతి ఆదివారం మన దేశంలో కొన్ని కోట్ల కోళ్లు, మేకలు ప్రాణాలు కోల్పోయి.. మనుష్యుల ఆహారంగా మారిపోతాయి కదా.. మరి, మాంసాహారాన్ని నిషేధించాలని జంతు ప్రేమికులు ఉద్యమించగలరా? కుక్కల ప్రాణాలకే ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు? ఊహా ప్రపంచంలో (ఉటోపియాలో) ఉంటే వాస్తవ ప్రపంచంలో జీవించగలమా? మన దేశంలో, మన రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులేమిటన్నదాన్ని బట్టి కదా ఏదైనా సమస్యకు పరిష్కారాలు ఆలోచించాల్సింది. తీవ్రమైన సామాజిక సమస్యగా మారిన వీధి కుక్కలకు ప్రాక్టికల్ పరిష్కారాలేమిటి? సంతాన నిరోధక ఆపరేషన్లా? బహిరంగస్థలాల నుంచి తొలగించి షెల్టర్లలో పెట్టటమా? లేక, వెనకటి రోజుల్లోలాగా ఏడాదికోసారో రెండుసార్లో మునిసిపల్ సిబ్బంది వీధి కుక్కలను సామూహికంగా నిర్మూలించటమా?.. దీనిపై విస్తృతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. జనం ప్రాణాల్ని వీధి కుక్కల బారి నుంచి రక్షించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి.

# డిఫాల్ట్ మిల్లర్లపై ఉదాసీనత 'అనుమానాస్పద' లావాదేవీలు

పల్లె వెలుగు

అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక. నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి. కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) చెల్లించడంలో విఫలమై డిఫాల్ట్ రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోకపోగా.. తిరిగి వారికే మళ్లీ మళ్లీ ధాన్యం కేటాయింపులు ఇవ్వడంతో ప్రభుత్వ ఖజానాకు భారీ గండిపడింది. అనుమానాస్పద లావాదేవీలు చోటుచేసుకోవడంతో సివిల్ సప్లరు కార్పొరేషన్ అధికారులు మిల్లులపై చర్యలు తీసుకోకుండా మరోసారి ధాన్యం కేటాయింపులు చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని సివిల్ సప్లరు కార్పొరేషన్ జిల్లా మేనేజర్ కార్యాలయంలో శనివారం, ఆదివారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా అనేక లోపాలు వెలుగుజూసినట్టు ఏసీబీ అధికారులు ప్రతికా ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాల ప్రకారం..2021-22 ఖరీఫ్ సీజన్‌లో 39 మిల్లుల యజమానులు డిఫాల్ట్ అయితే కేవలం రెండు రైస్ మిల్లుల యజమానులపై మాత్రమే చర్యలు తీసుకున్నట్టు గుర్తించారు. సుమారు 581 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రావాల్సి ఉంది. వాటి విలువ దాదాపు రూ.64 లక్షలున్నట్టు గుర్తించారు. అదే విధంగా 2022-23 ఖరీఫ్ సీజన్‌లో 37 మిల్లుల యజమానులు డిఫాల్ట్ అవ్వగా అప్పుడు కూడా రెండు రైస్ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి రూ.41 కోట్ల విలువైన 19,529 మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉంది. 2023-24లో ఖరీఫ్ సీజన్‌లో 7 మిల్లుల యజమానులు డిఫాల్ట్ కాగా ముగ్గురిపై చర్యలు తీసుకోగా.. 5,194 మెట్రిక్ ధాన్యం రావాల్సి ఉందని దాని విలువ రూ.2.5 కోట్లు. 2023-24లో గ్రీన్ హిల్స్ ఆగ్రో ఇండస్టీస్ కస్టమ్ మిల్లింగ్ బియ్యం విషయంలో డిఫాల్ట్ కావడంతో క్రిమినల్ కేసు నమోదైంది. అయినప్పటికీ, అధికారులు 2024-25 ఖరీఫ్ రబీ పంటను అదే మిల్లు యజమానికి కేటాయించినట్టు గుర్తించారు. తనిఖీలు చేపట్టని అధికారులు. గతేడాది సెప్టెంబర్ నుంచి జిల్లా పౌర సరఫరాల అధికారి, సంస్థ జిల్లా మేనేజర్ ఎంఎల్ఎస్ పాయింట్లను, రైస్‌మిల్లులను తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దాంతో పాటు కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఇకరు అనుమానాస్పద లావాదేవీల్లో పాలుపం చుకున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీనిపై లోతైన విచారణ చేపడుతున్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ రావడంలో భారీ కొరత ఉన్నప్పటికీ.. పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మేనేజర్, డిప్యూటీ తహసీల్దార్‌లు చర్యలు తీసు కోవడంలో విఫలం కావడంతో




ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులపై చర్యలు తీసు కోవాలని సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు నివేదించారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అధికారులు ఇటీవల బాధ్యతలు చేపట్టగా.. గతంలో పని చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా.. అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. రైతులకు సకాలంలో ఎంఎస్‌పీ చెల్లింపుల్లో కామారెడ్డి టాప్. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణలో ఐదు విభాగాల్లో జరిగిన కృషిపై సివిల్ సప్లరు కమిషనర్ సమీక్షించగా.. రాష్ట్రంలో రైతులకు సకాలంలో మద్దతు ధర డబ్బులు చెల్లించడంలో కామారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ధాన్యం సేకరించిన మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించడంతో సివిల్ సప్లరు అధికారి వెంకటేశ్వర్లు, మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉంది. 2023-24లో ఖరీఫ్ సీజన్‌లో 7 మిల్లుల యజమానులు డిఫాల్ట్ కాగా ముగ్గురిపై చర్యలు తీసుకోగా.. 5,194 మెట్రిక్ ధాన్యం రావాల్సి ఉందని దాని విలువ రూ.2.5 కోట్లు. 2023-24లో గ్రీన్ హిల్స్ ఆగ్రో ఇండస్టీస్ కస్టమ్ మిల్లింగ్ బియ్యం విషయంలో డిఫాల్ట్ కావడంతో క్రిమినల్ కేసు నమోదైంది. కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ ఈ నెల 23వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ స్టీఫెన్ రవీందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. తర్వాత రోజే కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరగడం కొసమెరుపు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Palleveluguneews9@gmail.com